@vaartanews @mvnewstv
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.mivaartanews.com
TGBIL/25/A0512
మంగళవారం
01 సెప్టెంబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
సంపుటి : 02
సంచిక :82
పేజీలు : 12 వెల : 5/-
IN MEDIA PUBLICATION PVT LTD
PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

# ఎమ్మెల్యేగా దానం అనర్హుడే



- పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.
- ఆయనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది
- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు.
- నాకు ప్రజా క్షేత్రంలో బలం ఉంది కలిసి పని చేస్తాం తప్పకుండా గెలుస్తాం

హైదరాబాద్

దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం వేసిన పిటిషన్?ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు, దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని, ఘర్ వాపసీ చట్ట సభలకు వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆయారాం, గయారాంలు పెరుగుతున్నారని- మిగతా 10లో



## ఎంత అధికారం వచ్చినప్పటికీ సేవా మార్గాన్ని వీడం

- సేవా సంకల్ప్ యాత్రలో పాల్గొన్న వారితో సంభాషించిన ప్రదాని మోదీ
- సేవనే తమ పాలన, విలువలకు కేంద్రబిందువన్న ప్రధాని
- ప్రజలకు సేవ చేయడమే తమ ప్రాథమిక లక్ష్యంగా ఉండాలి
- ప్రజలకు సేవ చేస్తే, ఆ సేవే సందేశంగా మారుతుంది

9

### స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది

# సుప్రీం చెంపపెట్టు

- దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు
- ఇది రాహుల్, రేవంత్‌కు తగిలిన చెంపపెట్టు అన్న కేటీఆర్
- ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ
- రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు
- పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని రాహుల్‌కు సవాల్




హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును - మిగతా 10లో

# హైదరాబాద్ నుంచి నందిగామ వరకే

- 6 వరుసలుగా హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం హైవే
- విస్తరణలో కీలక ముందడుగు
- హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం హైవే విస్తరణకు ఎన్‌హెచ్ఏఐ టెండర్ నోటిఫికేషన్‌ను జారీ
- హైదరాబాద్- విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) 4 నుంచి 6 వరుసలుగా విస్తరించనున్నారు



హైదరాబాద్/విజయవాడ

హైదరాబాద్- విజయవాడ-మచిలీపట్నం నేషనల్ హైవే (ఎన్‌హెచ్-65) 4 నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు కీలక ముందడుగు పడింది. ఇందులో భాగంగానే హైదరాబాద్ నుంచి నందిగామ వరకు, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు రెండు ప్యాకేజీలుగా బిడ్‌లను ఆహ్వానిస్తూ ఎన్‌హెచ్ఏఐ బుధవారం టెండర్ నోటిఫికేషన్?ను జారీ చేసింది. అయితే ఈ పనులకు సెంట్రల్ ఎకనమిక్ ఎఫైర్స్ కేబినెట్ కమిటీ ఆమోదం లభించాల్సి ఉంది. - మిగతా 10లో

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు సిద్ధమైన విపక్షాలు



- పార్లమెంటులో తీర్మానం పెట్టేందుకు సన్నాహాలు!
- పార్లమెంటులో తీర్మానం తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం
- ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాల అంశం తెరపైకి రాగా విపక్షాల నిర్ణయం!

9

## కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెరుగుతున్న ఒత్తిడి
- ఈసీలో విభేదాల వ్యవహారంతో రాజకీయ దుమారం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ 48 గంటల గడువు
- రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరిక
- రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్
- ఇప్పటికే విపక్షాల విమర్శల నేపథ్యంలో పెరిగిన ప్రాధాన్యం

9





### మోదీ, అమిత్ షా, సీఈసీ

## దేశ ద్రోహులు

- జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అంశంపై ప్రెస్‌మీట్ నిర్వహించిన రాహుల్‌గాంధీ
- సీఈసీ చేసిన పని భారత దేశానికి వ్యతిరేకమైన చర్యగా అభివర్ణించిన కాంగ్రెస్ అగ్రనేత
- రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ ఆయన్ను వారు కాపాడుతున్నారు

9

### మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌లపై

## పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ
- ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య



హైదరాబాద్

తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ - మిగతా 10లో



## బీజేపీలో భారీ సంస్థాగత మార్పులు

- తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్..
- తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్
- ఏపీ, తెలంగాణ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్ నియామకం
- తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్ బాధ్యతలు

ఆంధ్రప్రదేశ్‌తో సహా 5 రాష్ట్రాలకు జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్

- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శుల నియామకం::

9

### 22ఏ భూములపై రిజిస్ట్రేషన్లకు

# గ్రీన్ సిగ్నల్

- 22ఏ జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లు, భవనాలకు వర్తింపు
- తక్షణమే అమల్లోకి వచ్చిన ప్రభుత్వ తాజా ఆదేశాలు
- వేలాది మంది ఆస్తి యజమానులకు దక్కనున్న భారీ ఊరట
- అక్రమాలపై విచారణకు శ్రీదేవసేన నేతృత్వంలో ప్రత్యేక కమిటీ

9

హైదరాబాద్

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు - మిగతా 10లో

# సంపాదకీయం

## ప్రియాంకే ఎక్కువ క్రౌడ్ పుల్లరా

కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరుగుతోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత స్థానానికే పరిమితమవుతుండగా.. క్షేత్రస్థాయిలో అసెంబ్లీ ఎన్నికల బాధ్యతను ప్రియాంక భుజాలకెత్తేలా రోల్ డివిజన్ జరుగుతోందిరాష్ట్రాల ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ప్రచార శైలికి వస్తున్న ప్రజా స్పందన, ఆమె సక్సెస్ రేట్. గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల్లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో బిజీగా ఉన్నప్పుడు సైతం ప్రియాంక నేతృత్వంలో సాగిన దూకుడు ప్రచారం కాంగ్రెస్‌కు అద్భుత ఫలితాలనిచ్చింది. ముఖ్యంగా ఆమె ప్రసంగించే తీరు, ప్రజలతో మమేకమయ్యే విధానం, తన నాయనమ్మ ఇందిరా గాంధీని గుర్తుకు తెచ్చే హావభావాలు ఉత్తర, మధ్య భారత ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటాయి. స్థానిక నేతల మధ్య ఉండే గ్రూపు తగాదాలను చక్కదిద్దడంలోనూ, మహిళా ఓటర్లను ప్రభావితం చేయడంలోనూ ప్రియాంక అనుసరించే శైలి రాహుల్ కంటే చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపుతోంది.కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరగబోతున్నట్లు తెలుస్తోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.కానీ "రాహుల్‌ను అసెంబ్లీ ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించి, ప్రియాంకకు అప్పగిస్తున్నారు" అని చెప్పడానికి ప్రస్తుతం పరిస్థితులు సరిపోవు.మోదీ వర్సెస్ రాహుల్ గా మార్చి రాష్ట్ర స్థాయి ఎన్నికలను సైతం జాతీయీకరణ చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. అయితే, ప్రియాంక రంగంలోకి దిగితే ఆ సమీకరణం మారుతుంది. ఆమె స్థానిక సమస్యలు, ధరల పెరుగుదల, మహిళా సంక్షేమం, నిరుద్యోగం వంటి అంశాల చుట్టూనే ప్రచారాన్ని నడిపిస్తూ బీజేపీపై ఎదురుదాడి చేస్తారు. దీనివల్ల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.ఈ అంశంలో కొన్ని సవాళ్లు లేకపోలేదు. ప్రియాంక ఇమేజ్ ఎంత ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. స్థానిక బలమైన నాయకత్వం, గ్రౌండ్ లెవల్ బూత్ మేనేజ్‌మెంట్ లేకపోతే కేవలం వ్యక్తుల చరిష్మాతోనే ఎన్నికలను గెలవలేమని గత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపితమయింది. కాంగ్రెస్ ఇప్పటికే కొన్ని రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమిస్తూ, ఎన్నికల రాష్ట్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.అయితే ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీనే ప్రచారాన్ని నడిపిస్తారని కొత్త రాష్ట్ర ఇన్‌చార్జి సచిన్ పైలట్ స్పష్టంగా చెప్పారు.ఉత్తరాఖండ్‌లో కూడా కాంగ్రెస్ ప్రణాళికలో ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముగ్గురూ ప్రచారంలో పాల్గొనడం కనిపిస్తోంది. అంటే ఇప్పటి వరకు "రాహుల్‌కు అసెంబ్లీ ఎన్నికల నుంచి పూర్తిగా విముక్తి" అనే సూచనలు కనిపించడం లేదు.అవును. దీనికి ఒక ముఖ్యమైన ఉదాహరణ 2026 అసోం ఎన్నికల సమయంలో కనిపించింది. కాంగ్రెస్ ప్రియాంక గాంధీని అస్సాం చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ కమిటీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రక్రియలో కీలక పాత్ర పోషించింది.అంటే ప్రియాంక పాత్ర కేవలం సభల్లో ప్రచారం చేయడం వరకు కాకుండా టికెట్ల ఎంపిక, రాష్ట్ర స్థాయి ఎన్నికల వ్యూహం, సంస్థాగత సమన్వయం వంటి అంశాల వైపు కూడా విస్తరిస్తున్న సంకేతాలు ఉన్నాయి.అయితే ఇదే సమయంలో ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం ఉంది. 2027 ఉత్తరప్రదేశ్ ఎన్నికల కోసం కాంగ్రెస్ చేపడుతున్న పునర్వ్యవస్థీకరణను పరిశీలించిన పార్టీ రాహుల్ గాంధీ బృందానికే జఖ ప్రచార బాధ్యతను ఎక్కువగా అప్పగించే దిశలో ఉందని పార్టీ వర్గాలను ఉటంకించింది.ఆగస్టులో జరిగిన యూపీ కాంగ్రెస్ సమావేశానికి రాహుల్, ఖర్గే హాజరైనా, ప్రియాంక హాజరు కాలేదని కూడా ఆ కథనం పేర్కొంది. కాబట్టి ప్రస్తుతం కనిపిస్తున్నది , కాంగ్రెస్ సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ ఒక సంజీవనిలా కనిపించే ప్రియాంక ఫ్యాక్టర్‌ను.. ఈసారి పూర్తిస్థాయిలో ప్రయోగించి అసెంబ్లీ పోరుల్లో బీజేపీని నిలువరించాలని అధిష్ఠానం గట్టి పట్టుదలతో ఉంది. రాహుల్-ప్రియాంకల ఈ సరికొత్త పవర్ షేరింగ్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాల స్థాయిలో ఎంతవరకు పునరుజ్జీవాన్ని తెస్తుందో రాబోయే ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

# ప్యారడైజ్
# సామాన్యుడి నుంచి తిరుగుబాటు నాయకుడిగా?

పారడైజ్' సినిమాకు వచ్చిన బజ్, క్రేజ్ మరే సినిమాకూ రాలేదు. కేవలం జడల్ లుక్, రెండే రెండు పాటలతో ఇంత హైప్ తెచ్చుకోగలిగింది. ట్రైలర్ లేకుండానే ఈ సినిమా గురించి జనం మాట్లాడుకొనేలా, ఎదురు చూసేలా చేసింది. నాని కెరీర్‌లో కాస్ట్లీ సినిమా ఇది. ప్రీ రిలీజ్ బుకింగ్స్ కూడా అదే రేంజ్ లో కనిపించాయి. ఓ టాప్ హీరో, టైర్ 1 హీరో సినిమాకు కనిపించే హడావుడి.. పారడైజ్ విషయంలో కనిపించింది. ఈ సినిమా కొడితే ? నాని ఇంకో పది మెట్లు పైకి ఎదుగుతాడు. శ్రీకాంత్ ఓదెల అనే దర్శకుడు స్టార్ హీరోల కంట్లో పడతాడు. తెలుగు చిత్రసీమ కి సరికొత్త జోష్ వస్తుంది. ఇన్ని జరగాలంటే పారడైజ్ పంట పండాలి. మరి.. పారడైజ్ ఈ హైప్‌ని, క్రేజ్‌ని, అంచనాల్నీ అందుకోగలిగిందా? దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం తమ వరకూ రాని సవారీ జాతి కథ ఇది. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న పారడైజ్ ప్రాంతం అది. దాదాపు 5 వేలమంది సవారీలు అక్కడ ఎలాంటి గుర్తింపు లేకుండానే బతికేస్తుంటారు. అసలు వాళ్లు జనాభా లెక్కల్లోనే లేరు. ఆ ప్రాంతాన్ని షికంజా మాలిక్ (మోహన్ బాబు) నియంతలా పరిపాలిస్తుంటాడు. సవారీలకు ఎట్టిపరిస్థితుల్లోనూ గుర్తింపు రాకుండా చూసుకొంటుంటాడు. సవారీ జాతిలో సమ్మక్క (సోనాలీ కులకర్ణి) ఓ ధిక్కార స్వరం. ఆమెకు పుట్టినవాడే.. జడల్ (నాని). అమ్మంటే.. జడల్ కు అసహ్యం. చిన్నప్పుడే హత్యానేరంపై జైలుకి వెళ్లి? పద్నాలుగేళ్ల తరవాత తిరిగొస్తాడు. తన ఆశయం? షికంజా మాలిక్ ని చంపడమే. మరి? జడల్ ఆశ నెరవేరిందా? సవారీలకు గుర్తింపు ఎలా వచ్చింది? ఈ కథలో సుబ్బు (కయాదు లోహర్) పాత్రేమిటి? పారడైజ్ లో చిన మాలిక్ (రాఘవ్ జుయల్) సృష్టించిన విధ్వంసం ఎట్టిది? ఇవన్నీ? పారడైజ్ సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.ఒక ప్రాంతం, అక్కడ అణగదొక్కడబడిన జాతి, ఆ జాతిపై ఆధిపత్యం చెలాయించే విలన్, వాడికో మూర్ఖపు కొడుకు? విలన్ పై తిరుగుబాటు చేసే హీరో ? ఇదంతా చాలా పురానా ఫార్ములా. ఛత్రపతిలో చూసింది ఇలాంటి కథే. ఆ తరవాత చాలామంది దర్శకులు.. ఈ పాయింట్ పట్టుకొని సినిమాలు తీశారు. ఇప్పుడు శ్రీకాంత్ ఓదెల కూడా అదే చేశాడు. అయితే పాత కథల్ని కొత్తగా చెప్పాలన్న సూత్రాన్ని మాత్రం శ్రీకాంత్ కాస్తో కూస్తో ఒంట బట్టించుకొన్నాడు. అందుకే పారడైజ్ అనే ఓ ప్రపంచాన్ని సృష్టించాడు. హీరో చేతికి పచ్చబొట్టు (అదేంటో అందరికీ తెలుసు) పొడిపించాడు. హీరోకి జడలు వేశాడు. హీరోయిన్ పాత్రని సైతం డిఫరెంట్ గా రాయాలనే చూశాడు. వెబ్ సిరీస్ పాట్రన్ అలవాటు పడుతున్న ప్రేక్షకుల కోసం సినిమాని చాప్టర్లుగా డివైడ్ చేశాడు. ఇలా చాలా చాలానే ప్రయత్నించాడు. ఇన్ని చేసినా.. అసలు సిసలైన ఎమోషనల్ కనెక్షన్ అనేది ఇవ్వడం మర్చిపోయాడు. అది లేక.. హై ఓల్టేజ్ సీన్లు అని దర్శకుడు మనసులో అనుకొని, భారీగా తీసిన వన్నీ బోల్తా పడిపోయాయి. చాప్టర్ కీ చాప్టర్ కీ మధ్య ఓ కనెక్షన్ అనేది బిల్డ్ అవ్వలేదు. అసలు ఈ చాప్టర్ల గోలేంటి? అని కూడా అనిపిస్తుంటుంది. తెరపై అన్నీ ఉన్నా ? ఏదో మిస్ అవుతున్న ఫీలింగ్ కొన్నిసార్లు కలుగుతుంటుంది. ఆ ఏదో ఏమిటన్నది చాలా సినిమాల్లో అర్థం కాదు. పారడైజ్‌కి ఆ గొడవ లేదు. ఎమోషన్ మిస్సవుతుంది అనే సంగతి ప్రతీ సీన్‌లోనూ ప్రేక్షకుడికి అర్థం అవుతూనే ఉంటుంది. దర్శకుడికి ఆ సంగతి అర్థం కాలేదు.పారడైజ్ కోసం శ్రీకాంత్ సృష్టించుకొన్న సెటప్పులు బాగున్నాయ్. ఆ సెటప్పుల్లో ఉన్న పాత్రలు రెగ్యులర్ గా ఉన్నా ? కావల్సినంత ఎమోషన్ బిల్డప్ అవ్వడానికి ఈమాత్రం సరుకు సరిపోతుంది. కానీ.. దర్శకుడు ఎమోషన్ అనేది పైపై పూతే అనుకొన్నాడు. అందుకే చాలా సన్నివేశాల్లో ఎమోషన్ ఒక కోటింగ్ లానే కనిపిస్తుంది తప్ప? దాన్ని ప్రేక్షకుడు పూర్తి స్థాయిలో ఆస్వాదించేలా చేయలేకపోయాడు. సినిమా ప్రారంభమైన తొలి పది నిమిషాల్లో ఓ హై వస్తుంది. పారడైజ్ ప్రాంతాన్ని సమ్మక్క మాటల ద్వారా పరిచయం చేయడం, జైల్లో హీరో క్యారెక్టర్ ని రివీల్ చేయడం, కథలోని కాన్‌ఫ్లిక్ట్ ఏమిటన్నది అర్థమయ్యేలా చెప్పడం? ఇవన్నీ తొలి పది నిమిషాల్లోనే జరిగిపోతుంది. హీరో ఎప్పుడైతే పారడైజ్ లో అడుగు పెట్టాడో అక్కడ నుంచి గేమ్ మొదలవ్వాలి. కానీ.. అక్కడ విచిత్రంగా మాలిక్ పాత్రని సైడ్ చేసేశారు. ఇక నుంచి నేను మీకు కనిపించను?నా బాధ్యత అంతా నా కొడుకు తీసుకొంటాడు అని మోహన్ బాబు తో చెప్పించి, ఆ పాత్రని హైడ్ చేయడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది స్క్రీన్ ప్లే పరంగా దర్శకుడు చేసిన పెద్ద పొరపాటు. ఓరకంగా ఎస్కేపిజం. మోహన్ బాబు లాంటి విలన్ ని పెట్టుకొని, హీరోతో విలన్ కు కావాల్సిన కాన్‌ఫ్లిక్ట్ వేసుకొన్నా? వీరిద్దరూ ఎప్పుడు ఎదురుపడితే అప్పుడు కథ అయిపోతుందని భయపడ్డ దర్శకుడు? విలన్ ని హీరో కంట కనిపించకుండా దాచేయడం అనేది పెద్ద మిస్టేక్. ఆ స్థానంలో విలన్ కొడుకుని తీసుకొచ్చినా? దమ్ము సరిపోలేదు. నువ్వు ఎం.ఎల్.ఏవి అవ్వడం కాదు కదా, కనీసం నామినేషన్ కూడా వేయించనివ్వను..అని హీరో ఛాలెంజ్ చేయడం వరకే సరిపోయింది తప్ప, అందుకోసం జడల్ చేసిందేమిటన్నది అర్థం కాదు, ఈ గ్యాప్ ఫిల్ చేయడానికి హీరోయిన్ సుబ్బు పాత్రని ప్రవేశ పెట్టారు. సుబ్బు కథ ఇంచుమించుగా సమ్మక్క కథలానే ఉంటుంది. సమ్మక్క తన బిడ్డని కాపాడుకోవడానికి వేశ్య అయ్యింది. సుబ్బు.. తన తండ్రి పరువు నిలబెట్టడానికి తప్పుడు దారిలో వెళ్లింది. అంతే తేడా. ఇంట్రవెల్ లో ఒకటో రెండో తలకాయలు గాల్లో లేచిపోతే.. ఎమోషన్ వచ్చేస్తుంది అనుకొంటే పొరపాటు. ఆ పొరపాటు శ్రీకాంత్ ఓదెల కూడా చేసేశాడు. ఇంట్రవెల్ లో విలన్ కొడుకుని చంపి? విలన్ ఇంట్లో సవారీ గ్యాంగ్ తో సహా అడుగుపెడతాడు హీరో. అక్కడ మళ్లీ? మోహన్ బాబు ఉండడు. ఉంటే గనుక.. ఈ కథ ఇంట్రవెల్ దగ్గరే అయిపోదును. కాబట్టి? హీరో ? విలన్.. ఇంట్రవెల్ లో కూడా ఎదురు పడకుండా చూసుకోగలిగాడు దర్శకుడు.సెకండాఫ్ లో కూడా కథ అక్కడక్కడే గింగిరాలు తిరుగుతుంటుంది. ఓ సందర్భంలో మాలిక్ కి? జడల్ వార్నింగ్ ఇస్తాడు. అక్కడ ఈ సినిమా పూర్తిగా పడిపోయింది. ఎందుకంటే? విలన్, హీరో ఎదురుపడే తొలి సన్నివేశాన్ని దర్శకుడు ఎంత రసవత్తరంగా రాసుకొంటాడో అనిపిస్తుంది. దాన్ని చాలా డల్ మోడ్ లో చూపించాడు దర్శకుడు. ఆ తరవాత? ప్రత్యేక దేశం ఏర్పాటు, టీచర్లనీ, డాక్టర్లనీ కిడ్నాప్ చేయడం.. ఇలా కొంత డ్రామా నడిపించాడు. సడన్ గా కేసీఆర్‌ని పోలిన పాత్ర (ప్రియదర్శి) ఎంట్రీ ఇస్తుంది. అసలు ఈ పాత్ర అవసరం ఏమిటో దర్శకుడికే తెలియాలి. అనవసరంగా ఒక పార్టీ ముద్రని వేసుకోవడం మినహాయిస్తే కొత్తగా వచ్చే ఉపయోగం ఏమీ లేదు. టాడా యాక్ట్ అంటూ మరో ఎపిసోడ్ ముందుకు వస్తుంది. ఆ తరవాత.. క్లైమాక్స్ ఫైట్. విచిత్రం ఏమిటంటే.. విలన్ లేకుండానే క్లైమాక్స్ డిజైన్ చేశారు. విలన్‌కీ, హీరోకీ ఇక్కడ కూడా సంబంధం ఉండదు. అసలు విలన్ పాత్రని ముగించిన తీరు చూస్తే ? దర్శకుడు ఇంతకు మించి ఏం రాసుకోలేకపోయాడా అనిపిస్తుంది. చివరికి సవారీలకు ఓ గుర్తింపు వస్తుంది. దాంతో.. కథ సుఖాంతం అవుతుంది.సినిమా అంతా యాక్షన్ తో నిండిపోయింది. రక్తం ఏరులై పారింది. చంపడంలో ఒక్కోసారి ఒక్కో స్టైల్. ఒక్కో ఫైట్ ఒక్కో పేట్రన్. ఒక ఫైట్ అయితే కాంతారాని గుర్తుకు తెస్తుంది. తలలు, చేతులు తెగిపడుతూనే ఉంటాయి. కొన్ని సీన్లు, షాట్లు.. ఓవర్ ది బోర్డ్ గా కనిపిస్తాయి. చాలా పాత్రల్ని దర్శకుడు సరిగా వాడుకోలేదనిపిస్తుంది. సంపూర్ణేష్ ఈ సినిమా కోసం చాలా కాల్షీట్లు ఇచ్చాడు. దాదాపు సగం సీన్స్ లో ఏదో ఒక చోట కనిపిస్తాడు. కానీ.. పట్టుమని పది డైలాగులు కూడా లేవు. తనికెళ్ల భరణి కూడా అంతే. రాజా రవీంద్రతో ఏదో కొత్త గెటప్ ట్రై చేశారు. అదెందుకో అర్థం కాదు. మోహన్ బాబు ఎంట్రీ భలే ఉంటుంది. ఆయన గెటప్ కూడా బాగా సూటయ్యింది. కానీ చేసిందేమిటి? ఆ పాత్రని ఎలా ముగించాలో కూడా దర్శకుడికి అర్థం కాలేదు. భారతీయుడులో ముసలి కమల్ హాసన్ లా.. నానితో ఓ ఫైట్ చేస్తాడాయన. ఆ మరుసటి మీటింగ్ లోనే హీరో వెళ్లి? విలన్ ని వార్నింగ్ ఇస్తాడు. అక్కడితో మాలిక్ పాత్ర పాతాళంలోకి పడిపోయింది. హీరోయిన్ పాత్ర బీ గ్రేడ్ సినిమాల్లో నటించే పాత్రలా చూపించారు. ఓకే.. పరిస్థితుల్ని అర్థం చేసుకోవొచ్చు. కానీ హీరోయిన్ అమ్మ పాత్రనేంటి అలా డిజైన్ చేశారు? కూతురు బీ గ్రేడ్ సినిమాలు చేస్తానంటే ముందు పరువు పోతుంది.. అందరూ మోహాన ఉమ్మేస్తారు అని సుద్దులు చెప్పి, ఆ తరవాత.. నువ్వు ఇలాంటి సినిమాలే చేయాలి.. నువ్వు సింగిల్ టేక్ ఆర్టిస్టువి.. అనడం ఏమిటి? ఇలా చెప్పుకొంటూ పోతే? చాలా లూప్ హోల్స్ కనిపిస్తాయి ఈ కథలో.దర్శకుడు కొన్ని సింబాలిక్ షాట్లు బాగా తీశాడు. అతని ఆలోచన, ఊహ కొన్నిసార్లు భేష్ అనిపిస్తాయి. అయితే అవి ప్రేక్షకులకు రిజిస్టర్ అవుతున్నాయా, లేదా? అనేది కూడా చూసుకోవాలి కదా. కాకిని చాలాసార్లు మెటాఫర్ గా వాడారు. సమ్మక్క తన కొడుక్కి పెట్టిన పేరేంటన్నది చివరి వరకూ దాచడం కూడా బాగుంది. సమ్మక్క పాత్ర చనిపోయినప్పుడు చేయి.. జడల్ చేతిపై పడుతుంది. అప్పుడు పచ్చ బొట్టుపై కొడుకు అనే మాట మాత్రమే కనిపిస్తుంది. ఈ షాట్ కూడా ఎమోషనల్ గా కనెక్ట్ అవ్వాల్సినదే. ఇలాంటి కొన్ని మెచ్చుతునకలు సినిమాలో ఉన్నాయి. అయితే అవి సరిపోలేదు.నాని మేకొవర్ కి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. ఫస్ట్ సీన్.నుంచే తాను పాత్రలో ఉన్నాడు. ప్రేక్షకుల్ని కూడా తన వైపు తిప్పుకోవాలని చూశాడు. అసలు ఇలాంటి గెటప్ లో కనిపించడానికి హీరోలు సాహసించరు. దర్శకుడ్ని గుడ్డిగా నమ్మితేనే అడుగు వేస్తారు. నాని అదే చేశాడు. ఫైట్స్ లో కూడా చాలా కష్టపడ్డాడు. అరచి అరచి డైలాగులు చెప్పాడు. ఓ సినిమా కోసం ఓ హీరో ఎంత కష్టపడాలో అంతకంటే ఎక్కువ పడ్డాడు. సుబ్బు పాత్రలో కయాదుకు ఇది కొత్త తరహా రోల్. కాకపోతే పారడైజ్ ప్రపంచానికీ తనకూ సంబంధం ఉండదు. హీరో వల్ల వచ్చిన ఎమోషన్ అది. సో.. ఆ పాత్రతో సింపతైజ్ అవ్వడం కొంచెం కష్టం. మోహన్ బాబు లుక్, గెటప్ బాగున్నాయి. కానీ సరైన స్థాయిలో వాడలేదు. సంపూ పాత్ర గురించి రిలీజ్ కి ముందు చాలా అనుకొన్నారు. కానీ.. అనుకొన్నంతగా ఆ పాత్ర పండలేదు. రాఘవ్ జుయల్ ది ఫిల్లింగ్ పాత్రే. మోహన్ బాబు సైడ్ అయినప్పుడు ఆ బాధ్యత తాను తీసుకొన్నాడు.సాంకేతికంగా చూస్తే ప్రొడక్షన్ డిజైనింగ్ చాలా బాగా కుదిరింది. సెట్స్.. ఆ వాతావరణం సృష్టించడం మామూలు విషయం కాదు. రెండు పాటలు ఊపు తీసుకొచ్చాయి. అసలు ట్రైలర్ లేకపోయినా, సినిమాకు ఇంత హైప్ వచ్చిందంటే కారణం.. అనిరుథ్ ఇచ్చిన పాటలే. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లో ఇంతకు మించి ఆశించిన వాళ్లకు నిరాశే ఎదురైంది. సీన్ తో ఎమోషన్ కనెక్షన్ ప్రేక్షకులకే కాదు.. అనిరుథ్ కీ కుదరలేదనుకొంటా. అందుకే.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో తానూ ఏం చేయలేకపోయాడు. శ్రీకాంత్ ఓదెల ఛత్రపతి లాంటి కథని, హింస.. రక్తపాతాల్లో ముంచి తీద్దామనుకొన్నాడు. నాని క్యారెక్టర్ ని (చూపించే విధానంలో) కొత్తగా ఆలోచించినా, మిగిలిన విషయాల్లో రెగ్యులర్ బాటే పట్టాడు. మరీ ముఖ్యంగా ఎమోషన్ ని కావల్సిన స్థాయిలో రంగరించలేకపోయాడు.బిరియానీ వండాలంటే.. చాలా దినుసులు కావాలి. బాస్మతీ రైస్, లేత చికెన్, మసాలా దినుసులు, మంచి ఆయిల్? ఇలా? అన్నీ సమకూర్చుకోవాలి. కాకపోతే ఇవి ఉంటేనే బిరియానీ తయారవ్వదు. వంట మాస్టర్ చేతి మహత్తు కూడా చాలా అవసరం. అది లేకపోతే ఎన్ని దినుసులు ఉన్నా వంటలో రుచి ఉండదు. శ్రీకాంత్ ఓదెల ముందు ఇవన్నీ ఉన్నాయి. కానీ.. ఈసారి తన చేయి తిరగలేదు అంతే.

# కేంద్రమంత్రులకు చింతన్ బైఠక్

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి రెండు రోజుల పాటు అత్యంత కీలకమైన మేధోమథన సదస్సు నిర్వహిస్తోంది. ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం వేదికగా బుధ, గురువారాలు ఈ భేటీ జరగనుంది. కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు అందరూ పాల్గొంటున్నారు. వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌లో భాగంగా ఇప్పటివరకు సాధించిన ప్రగతిని సమీక్షించడంతో పాటు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన తదుపరి సంస్కరణలు, పాలనా ప్రాధాన్యతలను ఖరారు చేయడమే ఈ సమావేశం ప్రధాన అజెండా అని కేంద్రం ప్రకటించిందిఈ రెండు రోజుల సమావేశంలో ప్రధానమంత్రి ప్రధానంగా నాలుగు కీలక అంశాలపై మంత్రులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పథకాల అమలులో వేగం పెంచడం, మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గత సమన్వయం , శాఖాపరమైన అవరోధాలు తొలగించడం , సాధారణ ప్రజలకు జీవన సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడం. అంతేకాకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనే అంశంపై మంత్రుల కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్, సోషల్ మీడియా, ప్రజా సమస్యల పరిష్కార నివేదికలపై మంత్రుల పనితీరును ప్రధాని సమీక్షించనున్నారు.ఈ చింతన్ శిబిరం కోసం కేంద్ర మంత్రులను నాలుగు ప్రధాన గ్రూపులుగా విభజించారు. పథకాల అమలులో వేగం పెంచడం, మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గత సమన్వయం ,



శాఖాపరమైన అవరోధాలు తొలగించడం , సాధారణ ప్రజలకు జీవన సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడం. అంతేకాకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళు న్నారనే అంశంపై మంత్రుల కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్, సోషల్ మీడియా, ప్రజా సమస్యల పరిష్కార నివేదికలపై మంత్రుల పనితీరును ప్రధాని సమీక్షించనున్నారు.ఈ చింతన్ శిబిరం కోసం కేంద్ర మంత్రులను నాలుగు ప్రధాన గ్రూపులుగా విభజించారు. హర్‌దీప్ సింగ్ పూరి, పీయూష్ గోయల్ వంటి సీనియర్ మంత్రుల నేతృత్వంలోని ఈ బృందాలు.. ప్రభుత్వ సంస్కరణలు, టెక్నాలజీ ఆధారిత పాలన, యువత భాగస్వామ్యంపై ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇస్తున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం తరహాలోనే వికసిత్ భారత్ ను ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా ప్రజా ఉద్యమంగా ఎలా మార్చాలనే దానిపై మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలో మారుతున్న జనాభా తీరుకు అనుగుణంగా సీనియర్ సిటిజన్లను మెంటార్‌షిప్ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, విశ్వవిద్యాలయాల్లోని యువతను దేశాభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించడంపై చర్చలు సాగుతున్నాయి.ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం సగానికి సమీపిస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం రాజకీయంగా, పరిపాలనాపరంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఆగస్టు 15 ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రస్తావించిన నెక్స్ట్ లెవల్ రీఫార్మ్స్‌ను కార్యరూపంలోకి తెచ్చేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో, మంత్రుల పనితీరు, శాఖాపరమైన అవుట్‌పుట్ ఆధారంగా కేంద్ర మంత్రివర్గ విస్తరణ లేదా మార్పుచేర్పులు జరగవచ్చన్న ఊహాగానాలు ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తున్న వేళ సదస్సు హాట్ టాపిక్‌గా మారింది

# ఎస్‌బీహెచ్ కాలనీలో అన్నదానం.. మాండే మార్కెట్‌లో
# వినాయక నిమజ్జనంలో ఇర్షాద్ ఖాన్( ఉప్పల్ ఖాన్)





**బీరప్ప గడ్డ, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గం బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కాంగ్రెస్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) సందర్శించారు. ఈ సందర్భంగా వినాయక స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.అనంతరం మాండే మార్కెట్‌లో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఇర్షాద్ ఖాన్ పాల్గొని భక్తులు, మండపాల నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ ప్రజలందరినీ ఐక్యంగా నిలిపే ఆధ్యాత్మిక, సామాజిక వేడుక అని అన్నారు. కాలనీ ప్రజలు, యువత, మహిళలు, మండపాల కమిటీ సభ్యులు సమష్టిగా కార్యక్రమాలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ శాంతి, సోదరభావం, ఐక్యతతో పండుగలను జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ తుమ్మల సందీప్ భూషణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా. అట్ల అంజయ్య, గడ్డం రోహిత్, మన్నింగ్, విష్ణు, పవన్, రాజశేఖర్, లక్ష్మణ్, రాజేష్, సాయి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కాలనీ పెద్దలు, వినాయక మండపాల కమిటీ సభ్యులు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన అన్ని మండపాల నిర్వాహకులు, భక్తులు, బీరప్పగడ్డ డివిజన్ ప్రజలకు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# చిల్కానగర్‌లో మంచినీటి పైప్‌లైన్‌కు నిధులు కేటాయించాలి

**- వాటర్ వర్క్స్ జీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేసిన బన్నాల ప్రవీణ్ ముదిరాజ్**

**చిల్కానగర్, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త):**

చిల్కానగర్ డివిజన్‌లోని నవోదయ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి వెంటనే నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. నవోదయ కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న వీధిలో సీవరేజ్ పైప్‌లైన్ పనులు ఇప్పటికే పూర్తయినందున, అదే ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను కూడా చేపట్టాలని కోరుతూ నవోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి వాటర్ వర్క్స్ జీఎం సంతోష్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. నవోదయ కాలనీలోని కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న వీధిలో సీవరేజ్ పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్థానిక ప్రజలకు మంచినీటి సరఫరా సౌకర్యం మెరుగుపడేందుకు వెంటనే వాటర్ పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జీఎంను కోరినట్లు చెప్పారు. స్థానిక ప్రజల సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.వినతిపత్రంపై స్పందించిన వాటర్ వర్క్స్ జీఎం సంతోష్, వీలైనంత త్వరగా పైప్‌లైన్ పనులకు సాంక్షన్ మంజూరు చేసి, అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నవోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బాలేందర్, బాల మల్లేష్, నరేష్, రాజ్ కుమార్, రాధాకృష్ణ, సాయి, బబ్లు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## ఉప్పల్‌లో పలు గణేష్ మండపాలను సందర్శించిన రజిత పరమేశ్వర్ రెడ్డి

**- గణనాథుడికి ప్రత్యేక పూజలు..**

**నిర్వాహకుల ఘన సత్కారం**





**ఉప్పల్, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త):**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి గురువారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని పలు గణేష్ మండపాలను సందర్శించారు. శాంతినగర్, గాంధీనగర్, ఓల్డ్ భారత్‌నగర్ ప్రాంతాలతో పాటు ఉప్పల్ మహంకాళి యూత్ అసోసియేషన్, పవనపుత్ర ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆమె సందర్శించి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు రజిత పరమేశ్వర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మండపాల నిర్వాహకులతో, భక్తులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమాల్లో గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు చేపట్టిన డైరెక్టర్ రాహుల్ రాజ్ (ఐ.ఏ.ఎస్)

**కాప్రా, సెప్టెంబర్ 24: (వార్త ప్రతినిధి)**



వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్(ఐఏఎస్) మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు డైరెక్టర్‌ను కలిశారు.

జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న పనులపై డైరెక్టర్ రాహుల్ రాజ్ అధికారులతో చర్చించరన్నారు.



- పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన నూతన పనులకు మంజూరు. మరియు చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మల్లేశం, ప్రసాద్ రావు, ఎం.డి. రియాజ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ, అసిస్టెంట్ సెక్రటరీ మరియు మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారని జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు....

**జవహర్ నగర్, సెప్టెంబర్ 24: (వార్త ప్రతినిధి)**



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ డివిజన్ గబ్బిలాలపేటలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గబ్బిలాలపేట గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గత 14 ఏళ్లుగా గణనాథునికి నిష్ఠతో పూజలు నిర్వహిస్తూ, కాలనీవాసుల సహకారంతో ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, స్థానికులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాహకులు వరికుప్పల మల్లేష్, మందా శ్రీనివాస్, పానుగంటి నరేష్, వరికుప్పల నాగేష్, ఓట్స్ విజయ్, ఏలూరి బాలకృష్ణ, జిల్లపల్లి శ్రీకాంత్, బంద్రవెల్లి శ్రీనివాస్, శాగా అనిల్ తదితరులు పాల్గొన్నారు..

## రూ.1,75,000 లకు లడ్డుని గెలుచుకున్న కాకతీయ స్కూల్ డైరెక్టర్ తిరుపతి రావు

**కూకట్పల్లి, సెప్టెంబర్ 24 మన మీ వార్త**



కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లోని కాకతీయ స్కూల్ డైరెక్టర్ పెండ్యాల తిరుపతి రావు వినాయక చవితి ఉత్సవాల్లో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొని రూ. 1,75,000/-లకు లడ్డూను దక్కించుకున్నారు. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూను దక్కించుకున్న పెండ్యాల తిరుపతి రావు కి నిర్వాహకులు, భక్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడుతూ, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఉప్పల్, రామంతాపూర్ డివిజన్లలోని పలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త):**



ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గురువారం నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్ డివిజన్లలో పలు గణేష్ మండపాలను సందర్శించి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రామంతాపూర్‌లోని ఇందిరానగర్, రాజేంద్రనగర్, ఆర్టీసీ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆయన సందర్శించారు. అలాగే ఉప్పల్‌లోని మహంకాళి యూత్ అసోసియేషన్, మహంకాళి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు పరమేశ్వర్ రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మండపాల నిర్వాహకులు, భక్తులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జీఓ 240 వద్దు.. మా భూములు మాకు కావాలి
## ఉప్పల్ రైతుల పక్షాన గళమెత్తిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త ):**



ఉప్పల్ మూసీ పరీవాహక అభివృద్ధి పథకంలో భాగంగా భూముల స్వాధీనానికి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 240పై ఉప్పల్ నియోజకవర్గ రైతుల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రైతులతో కలిసి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని గురువారం కలిశారు.ఈ సందర్భంగా రైతులు "మా భూములు మాకు కావాలి.. ఎలాంటి పరిహారం వద్దు.. జీఓ 240 వద్దు" అంటూ తమ అభ్యంతరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలు, వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.మూసీ నదికి సుమారు ఒక కిలోమీటర్ పరిధిలోని భూముల స్వాధీనం అంశంపై రైతులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నచిన్న కమతాలు కలిగిన రైతులు, ఇప్పటికే నివాస ప్రాంతాలు ఏర్పడిన భూముల యజమానులు, ఖాళీ స్థలాలు కలిగిన రైతుల విషయంలో ప్రభుత్వం అనుసరించనున్న విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని కలెక్టర్‌ను కోరారు.రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వారి భూముల విషయంలో న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## ఆయా, ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల నియామకాల్లో పారదర్శకత పాటించాలి

**చిట్యాల సెప్టెంబర్ 24 మీ వార్తా**



చిట్యాల మండలంలోని ఆయా, ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల నియామకాల్లో సరైన రోస్టర్ విధానాన్ని పాటించి, నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు ఎంఈఓను కోరారు. నియామక ప్రక్రియలో ఎలాంటి పక్షపాతం, రాజకీయ జోక్యానికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. రోస్టర్ విధానాన్ని సక్రమంగా అమలు చేస్తూ, అర్హతలు మరియు ప్రభుత్వ నిబంధనల ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మండల యూత్ ప్రెసిడెంట్ తౌటం నవీన్, ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్ రావు, టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్ గౌడ్, జూకల్ సర్పంచ్ ఎలగొండ తిరుపతి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్ పాల్గొన్నారు.

## తెలంగాణ సంపత్ ను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ ఈటల రాజేందర్



**చిలుకా నగర్, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త):**

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, బీజేవైఎం రాష్ట్ర నాయకులు తెలంగాణ సంపత్ తన జన్మదిన సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ తెలంగాణ సంపత్‌ను శాలువాతో సత్కరించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం తెలంగాణ సంపత్‌కు ఆశీర్వాదం అందించిన ఈటల రాజేందర్, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ నిమజ్జనంలో అపశృతి హల్ది కాలువలో పడ్డ యువకుడు

**పోలీసులు ఫైర్ సిబ్బందితో గాలింపు**

**సెప్టెంబర్ 24 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి**



మాసాయిపేట మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బుధవారం నిమజ్జనం సందర్భంగా గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో



కమిండ్ల గణేష్ ప్రమాదవశాత్తు హల్ది ప్రాజెక్టు కాలువలో గల్లంతు కావడంతో. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలో గణేష్ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా, గణేష్ ఇటీవలే తన చెల్లెలి వివాహాన్ని జరిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిమజ్జన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి

## శ్రీ వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడిని దర్శించుకున్న కంది శ్రవణ్ కుమార్ రెడ్డి





**హబ్సీగూడ, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త):**

హబ్సీగూడ డివిజన్ గాంధీ గిరిజన బస్తీ (జీజీ కాలనీ)లో శ్రీ వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డికి కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సుమన్ నాయక్, శంకర్ నాయక్, శరత్ నాయక్, గణేష్ నాయక్, గోపి కృష్ణ నాయక్ (సోను), వినయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ర వినాయకున్ని పూజించిన కలెక్టర్

**బోసి గ్రామంలో కర్ర వినాయకునికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రత్యేక పూజలు**



**నిర్మల్ :** నిర్మల్ జిల్లా తానూరు మండలం బోసి గ్రామంలోని ప్రసిద్ధ కర్ర వినాయకుని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ కు పూజారులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. స్థానిక శివాలయంలోని గణేశునికి, శివునికి పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ప్రమాదకర విద్యుత్ వైర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలి. ఐదు నెలలుగా విన్నవిస్తున్నా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం: సాయిజెన్ శేఖర్

**నాచారం, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త):**

నాచారం ప్రధాన రహదారిపై జాన్సన్ గ్రామర్ స్కూల్‌కు వెళ్లే మలుపు వద్ద శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీలోని కేజేఎన్ రెడ్డి భవనం మొదటి అంతస్తు బాల్కనీకి అత్యంత సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ డిమాండ్ చేశారు. బాల్కనీకి ఆనుకుని ఉన్న విద్యుత్ వైర్లు భవనంలో నివసించే వారితో పాటు రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సమస్యను పరిష్కరించాలని గత ఐదు నెలలుగా నాచారం ఎలక్ట్రికల్ ఏఈ నాగరాజును పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని సాయిజెన్ శేఖర్ తెలిపారు. విద్యుత్ వైర్లకు షార్ట్‌సర్క్యూట్ జరగకుండా, ప్రమాదవశాత్తు వ్యక్తులు వాటిని తాకకుండా సేఫ్టీ పైపులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే వైర్లను సురక్షిత దూరానికి మార్చేందుకు యాంగిల్స్, సపోర్టింగ్‌లు ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినట్లు చెప్పారు. అయితే ప్రతిసారి "కాంట్రాక్టర్‌ను పంపిస్తాం.. త్వరలో పనులు చేయిస్తాం" అంటూ హామీలు ఇస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించలేదని ఆయన పేర్కొన్నారు. ఒక దశలో కాంట్రాక్టర్ ఫోన్ నంబర్ కూడా ఇచ్చారని, త్వరలో పనులు పూర్తిచేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.




"ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకముందే నివారణ చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాన్ని నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఎంతవరకు సమంజసం?" అని సాయిజెన్ శేఖర్ ప్రశ్నించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ సమస్యపై మరోసారి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేసి, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను వెంటనే పరిశీలించి, అవసరమైన సేఫ్టీ పైపులు, సపోర్టులు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఏఈ నాగరాజును కోరారు.సమస్యను పరిష్కరించడంలో ఇంకా జాప్యం జరిగితే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు సమస్య పరిష్కారం కోసం తదుపరి చర్యలు తీసుకుంటామని సాయిజెన్ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు!

**పటాన్ చేరు సెప్టెంబర్ 24 మీ వార్త ప్రతినిధి :**

**- సాకి చెరువును పరిశీలించిన సైబరాబాద్ సీపీ ఎం. రమేష్..**

**- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు**

పటాన్‌చెరు వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టింది. శుక్రవారం జరగనున్న నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో సైబరాబాద్ సీపీ ఎం. రమేష్ డిసి జ్యోతి రెడ్డితో కలిసి గురువారం పటాన్‌చెరులోని సాకి చెరువును



పరిశీలించారు. శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాస్, రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్‌తో కలిసి నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, మున్సిపల్, మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు సీపీ వెల్లడించారు. భక్తులు పోలీసులకు సహకరిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

# జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చిట్యాల సెప్టెంబర్ 24 మీ వార్త**

చిట్యాల: ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిట్యాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీదేవి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. యుగందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీదేవి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ మరియు దేశభక్తి వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సమాజంతో మమేకమై ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభిస్తుందని తెలిపారు ఎన్ఎస్ఎస్ నినాదానికి అనుగుణంగా ప్రతి విద్యార్థి వ్యక్తిగత ప్రయోజనాలకంటే సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అన్నారు. పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, రక్తదానం, ఆరోగ్య అవగాహన, అక్షరాస్యత మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి బి. శ్రీదేవి ని మరియు ప్రస్తుత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. యుగందర్ ని ఘనంగా సన్మానించారు. అలాగే కళాశాల పూర్వ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీ హెచ్. కర్ణాజీ ని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఘనంగా సన్మానించి ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలకు వారు అందించిన సేవలను అభినందించారు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. యుగందర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు



ఉత్సాహంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొని సమాజ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, లెక్చరర్లు, కళాశాల టీచింగ్ మరియు నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టుల

**- బీఆర్ఎస్ నేతలు ముందస్తు అరెస్ట్**

**చిట్యాల సెప్టెంబర్ 24 మీ వార్త**

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడం సరైంది కాదని పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్ అన్నారు గురువారం రోజున భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపు మేరకు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ) సందర్శనకు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను చిట్యాల మండల కేంద్రంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, విద్యుత్ కోతలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు గణపురం మండలం చెల్పూర్‌లోని కేటీపీపీ (జెన్కో) సందర్శనకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు బయలుదేరి క్రమంలోనే. చిట్యాల మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. "ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే



అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడమే" అంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.

అరెస్టైన వారిలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, మండల ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ బాబు, మండల యువజన అధ్యక్షుడు తౌటం నవీన్, టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్ గౌడ్, జూకల్ సర్పంచ్ ఎలగొండ తిరుపతి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, సీనియర్ నాయకులు సాధ మల్లయ్య, వేముల శ్రీనివాస్, గోపగాని నర్సింహ రాములు తదితరులు ఉన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## భారీ వర్షాలు.. అప్రమత్తమైన బల్దియా డీఆర్ఎఫ్

**- విరిగిపడిన చెట్లను తొలగించి రహదారులపై రాకపోకలు పునరుద్ధరణ**

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రోడ్డుపై విరిగిపడిన చెట్లను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డీఆర్ఎఫ్ బృందాలు వేగంగా తొలగించి రాకపోకలను పునరుద్ధరించాయి. హనుమకొండ ఎక్సైజ్ కాలనీ, ప్రభుత్వ టీబీ ఆసుపత్రి, దేవన్నపేట ప్రధాన రహదారి, సమ్మయ్యనగర్ ప్రాంతాల్లో చెట్లు నేలకొరగడంతో డీఆర్ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక శాఖ బృందాలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ టీబీ ఆసుపత్రి వద్ద విద్యుత్ స్తంభం, తీగలపై పడిన భారీ వృక్షాన్ని కూడా సురక్షితంగా తొలగించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ శంకర్‌లింగం నేతృత్వంలో జరిగిన ఈ చర్యల్లో ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమకొండ ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పై సమావేశం

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితా డీనోవా తయారీపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి నిర్వహించారు. గత గురువారం నుంచి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా డినోవా తయారీకి సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి కొత్తగా గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికల సంఘం సూచించిన మేరకు పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హనుమకొండ, ఐనవోలు మండలాల తహసిల్దార్లు రవీందర్ రెడ్డి, విక్రమ్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ. వి. శ్రీనివాస్ రావు, రావు అమరేందర్ రెడ్డి, జి.ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ ఫైజుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా మాధిర గ్రామంలో భూ రీ-సర్వే, గ్రామ సరిహద్దుల పరిశీలన

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు నర్సంపేట మండలం మాధిర మరియు దుగ్గొండి మండలం మందపల్లి గ్రామంలో భూ రీ-సర్వే, గ్రామ సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా గ్రామ సరిహద్దులు, భూ రికార్డులు, రీ-సర్వే ప్రక్రియలో చేపడుతున్న పనులను పరిశీలించారు. రీ-సర్వేలో భాగంగా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి పక్కాగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు సూచించారు.
ఈ కార్యక్రమంలో దుగ్గొండి మండల తహసిల్దార్ సమ్మక్క సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు... తర్వాత ఫించన్లు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కేవలం రాజకీయంగా విపక్షాలకు ముచ్చెమటలు పట్టించడమే కాకుండా సామాన్య ప్రజలకు పథకాలు విస్తృతంగా అందించి క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న లక్షలాది కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పట్టాలెక్కించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎదురుచూస్తున్న అర్హులందరికీ అక్టోబర్ నుంచే కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే దసరా పండుగకు ముందే లబ్ధిదారుల చేతుల్లో ఈ పింఛన్ నగదు ఉండేలా చూడాలని అధికారులకు అత్యున్నత స్థాయి నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి బల్దియా కమిషనర్ టి వెంకన్న

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

అత్యవసర సేవలకు GWMC కంట్రోల్ రూమ్ 9701999645 టోల్‌ఫ్రీ: 1800 425 1980 వాట్సాప్: 9701999676 నెంబర్లకు సంప్రదించాలి
రెస్క్యూ బృందాలు, యంత్రాలు సిద్ధంగా ఉంచాలి: బల్దియా కమిషనర్ టి. వెంకన్నఅధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో కమిషనర్ వెంకన్న ఆదేశాలు

రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ తదితర విభాగాల అధికారులతో కమిషనర్ టి. వెంకన్న టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో వర్షాల పరిస్థితి, నీటిముంపు ప్రాంతాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, సిబ్బంది, యంత్రాల అందుబాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి విభాగం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చోట తక్షణమే స్పందించాలని కమిషనర్ సూచించారు. విభాగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జెసిబి లు, డీవాటరింగ్ మోటార్లు, ట్రాక్టర్లు, ఇతర అవసరమైన యంత్రాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు సిబ్బంది, యంత్రాలను ఆలస్యం లేకుండా తరలించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. చెట్లు విరిగిపడటం, రహదారులపై వరదనీరు నిలవడం, విద్యుత్ సంబంధిత సమస్యలు, నాలాలు పొంగిపొర్లడం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రమాద పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని కమిషనర్ ఆదేశించారు. పరిస్థితులు తీవ్రతరమైతే ఆయా ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, అవసరాన్ని బట్టి సురక్షిత ప్రాంతాలు, సహాయక/పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ తదితర విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నగరంలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఏ సమస్య గుర్తించినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి, ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి వర్షాలు, నీటిముంపు, వరదనీరు, చెట్లు విరిగిపడటం తదితర సమస్యలపై ఫిర్యాదులు, సమాచారాన్ని స్వీకరించేందుకు +ఔవీజ ప్రధాన కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.
అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్‌ఫ్రీ: 1800 425 1980 కంట్రోల్ రూమ్: 9701999645 వాట్సాప్: 9701999676 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.
ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ టి. వెంకన్న కోరారు.
ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ జీడబ్ల్యూఎంసీ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బల్దియా అధికారులు రెస్క్యూ, డి ఆర్ ఎఫ్ బృందాలు, సిబ్బంది, యంత్రాలు సిద్ధంగా ఉన్నాయని కమిషనర్ వెంకన్న తెలిపారు.

# వర్షం నేపథ్యంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్ సీపీ శ్వేత, జిడబ్ల్యుఎంసి కమిషనర్ వెంకన్న నిమజ్జనం పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశం

వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గణేశ్ నిమజ్జన ప్రక్రియను వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ శ్వేత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రక్రియ కొనసాగుతున్న తీరు, భక్తుల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఇప్పటివరకు నిమజ్జనం పూర్తయిన గణేశ్ విగ్రహాల సంఖ్య, ఇంకా నిమజ్జనం చేయాల్సిన విగ్రహాల వివరాలను సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గణేశ్ విగ్రహాలను సాధ్యమైనంత త్వరగా నిమజ్జన కేంద్రాలకు తీసుకువచ్చి నిమజ్జనం పూర్తిచేసుకునేలా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.





వర్షం కారణంగా భక్తులు, నిర్వాహకులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సీపీ శ్వేత, కమిషనర్ వెంకన్న సూచించారు. పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు.
అదేవిధంగా నిమజ్జనం పూర్తైన వెంటనే విగ్రహాల అవశేషాలు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కమిషనర్ వెంకన్న ఆదేశించారు.

ఈ పరిశీలనలో GWMC సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, శ్రీ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హన్మకొండ వయో వృద్ధులు మార్గదర్శకులు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వారాంతపు అవగాహనలపై అధికారులతో సమీక్ష

హన్మకొండ వయో వృద్ధులు మార్గదర్శకులు
అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వారాంతపు అవగాహనలపై అధికారులతో సమీక్ష

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి

వయో వృద్ధులు మన జీవితానికి మార్గదర్శకులని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహించ తలపెట్టిన వారాంతపు కార్యక్రమాలపై జిల్లా అధికారులు, వయో వృద్ధుల అసోసియేషన్ వారితో గురువారం మినీ కాన్ఫెరెన్స్ హాల్ లో కలెక్టర్ రివ్యూ చేసారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ...
అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా షెడ్యూల్ ప్రకారం అన్నీ కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు
జిల్లాలోని ప్రతి వృద్ధాశ్రమంలోని వయో వృద్ధులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతి కేంద్రాన్ని సంబంధిత అధికారులు సందర్శించాలని, యోగా ప్రాణాయామం పై అవగాహన కల్పించాలని, క్యారమ్, చెస్ పాటల పోటీలతో వారిలో నూతన ఉత్తేజాన్ని నింపాలని, జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ లో తల్లి తండ్రులు వయో వృద్ధులు పోషణ, సంక్షేమ చట్టం 2007, నియమావళి 2011, మ సవరణ నియమావళి 2011 యాక్ట్ పై రూపొందించిన ఫోమ్ బోర్డ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
జిల్లాలో నిర్వహిస్తున్న వయో వృద్ధుల కేంద్రాలు పాటిస్తున్న కనీస ప్రమాణాలు సంబంధిత నివేదికలు సత్వరమే అందించాలని సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా వయో వృద్ధుల సమాచార సంచిక గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు
వారాంతపు అవగాహన కార్యక్రమాలు
గురువారం (24.09.2026) (నేడు)రోజున వయో వృద్ధుల హక్కులు సంక్షేమం కార్యక్రమాన్ని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రారంభం
శుక్రవారం (25.09.2026) రోజున ప్రాథమిక, పట్టణ, బస్తీ దవాఖాన లలో క్యాటరాక్ట్ పరీక్షలు వయో వృద్ధులకు ఆటవిడుపు కార్యక్రమాలు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని వృద్ధాశ్రమంలో నిర్వహించడం
శనివారం రోజున వృద్ధాశ్రమాల సామర్థ్య నిర్మాణంపై వర్క్ షాప్, పర్యవేక్షణ, రిజిస్ట్రేషన్ రెన్యువల్, కనీస ప్రమాణాలు పై జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ డే కేర్ సెంటర్ లో అవగాహన, సోమవారం రోజున (28.09.2026) ఫైనాన్స్ సేఫ్టీ, డిజిటల్ లిటరసీ, పెన్షన్, బ్యాంకింగ్ సేఫ్టీ, యూపీఐ పేమెంట్స్, సైబర్ ఫ్రాడ్ పై హనుమకొండ ప్రణాం రెడ్ క్రాస్ డే కేర్ సెంటర్ లో పోలీస్, జిల్లా సంక్షేమ అధికారి, లీడ్ బ్యాంక్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సైబర్ పోలీస్ వింగ్ , మరియు న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. మంగళవారం (29.09.2026) రోజున శాయంపేట మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ బాండింగ్, లెర్నింగ్ డే సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం బుధవారం (30.09.2026) రోజున వాకథాన్ కార్యక్రమం, యోగా ప్రాణాయామం పై అవగాహన, గురువారం (01.10.2026) రోజున జిల్లా స్థాయిలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఓల్డ్ ఏజ్ పర్సన్స్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ హాల్ లో నిర్వహించడం జరుగుతుంది
ఈ సమావేశం లో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, డిప్యూటీ డీఎంఅండ్హెచ్వో డాక్టర్ టి మదన్ మోహన్ రావు, ఏడీఆర్డిఓ వెంకటేష్, జీసిడివో ఎస్ సునీత, ఏసీపీ సదయ్య, సిడిపిఓ లు వి సింధురాణి, సిహెచ్ అవంతి, ఎస్ఐ శ్రావణి,
సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు దేవాచారి,చంద్రమౌళి, ధర్మరాజు, లార్డ్ వృద్ధాశ్రమ నిర్వాహకులు నరేష్,
జిల్లా మహిళా సాధికారత మిషన్ సమన్వయకులు దొమ్మేటి కల్యాణి, ఇంచార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్వో రవికృష్ణ, ప్యానల్ అడ్వకేట్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.





# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- చెరువులు, వాగులు, నాలాల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**





హనుమకొండ కలెక్టరేట్ నుండి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ సమావేశం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరిస్థితులు, గురు, శుక్రవారాలపాటు వర్షాలకు హై అలెర్ట్ ఉన్న నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు.
మండలాల వారీగా వర్షపాతం, చెరువుల పరిస్థితి, వాగులు, వంకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో వర్షాల సమయంలో సమస్యలు ఎదురైన ప్రాంతాల వివరాలను తెలుసుకుని, ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. . జిల్లాలోని వేలేరు , ఆత్మకూర్ మండలాల్లో బుధవారం కురిసిన వర్షంతో అధిక వర్షపాతం నమోదైందన్నారు. నేడు, రేపు (గురువారం, శుక్రవారం)కూడా ఆకస్మికంగా భారీ వర్షపాతం నమోదైతే వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలను అధికారులు చేపట్టాలన్నారు.
చెరువులు, వాగులు, వంకల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వరద నీరు రహదారులపైకి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
అవసరమైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేర నీరు ఉందో సాగునీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు.
వర్షపాతం పెరిగినప్పుడు చెరువుల నీటిమట్టం, నీటి ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు.
భారీ వర్షాల సమయంలో అధికారులు తమ పరిధిలో స్థానికంగానే అందుబాటులో ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయిలో స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రస్తుతం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించాలని ఆదేశించారు.
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను వెంటనే తొలగించాలన్నారు.
ప్రధాన నాలాల వద్ద వరద నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలాగే అన్నీ మండలాల్లో అవసరమైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో.. కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సమయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.
ఎక్కడ సమస్య తలెత్తే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారులు, వాగులు, వంకలు, చెరువులు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.
జిల్లాలో ఎక్కడైనా వర్షాల కారణంగా జరిగిన నష్టం పై వెంటనే వివరాల నివేదికను అందజేయాలన్నారు.
ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎడతెరపి లేకుండా వర్షం కురిసినప్పుడు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
ఈ గూగుల్ మీట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, జడ్పీ సీఈఓ శేషాద్రి, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, సాగునీటి పారుదల శాఖ ఈఈ మంగీలాల్, రోడ్లు,భవనాలు శాఖ ఈఈ దేవిక చౌహాన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు లక్ష్మీనగర్ కాలనీ వాసుల ప్రతిజ్ఞ

- గణనాథుడి మట్టిని మొక్కలకు వినియోగిస్తూ..
ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం

**మీ వార్త / కుత్బుల్లాపూర్ :**







సూరారం గ్రామంలోని లక్ష్మీనగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కాలనీవాసులు పర్యావరణ పరిరక్షణకు వినూత్న నిర్ణయాలు తీసుకున్నారు. కాలనీ అధ్యక్షురాలు శ్రీమతి అమృతారెడ్డి, కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, కాలనీవాసులు కలిసి గణనాథుడికి పూజలు నిర్వహించారు. నిమజ్జనం అనంతరం విగ్రహంలోని మట్టిని నీటిలో కరిగించి, ఆ మట్టిని ఇళ్ల వద్ద ఉన్న పూల మొక్కలు, పెరటి చెట్లకు వినియోగించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని కాలనీవాసులు ప్రతిజ్ఞ చేశారు. అలాగే ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించాలని నిర్ణయించారు. పిల్లలకు ఈత ఒక ముఖ్యమైన జీవన నైపుణ్యమని తెలియజేస్తూ, వారికి ఈత నేర్పిస్తామని సామాజిక పర్యావరణ కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ సమక్షంలో కాలనీవాసులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో నీటి కొరత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి పంపించి భూగర్భ జలాలను కాపాడుకోవచ్చున్నారు.
రవీందర్ సూచనలపై కాలనీవాసులు సానుకూలంగా స్పందిస్తూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని చర్చించుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచేందుకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

# ఉప్పల్ రింగ్ రోడ్డులో 25న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్వాగత వేదిక-నిమజ్జనానికి తరలివచ్చే గణనాథులకు ఘన స్వాగతం

---మధ్యాహ్నం ఒంటిగంట నుంచి స్వాగత కార్యక్రమాలు
-- ఉప్పల్ శాఖ కన్వీనర్ ఆకుల రాకేష్

**ఉప్పల్, సెప్టెంబర్ 24 ( మన మీ వార్త ):**

47వ సామూహిక గణేష్ నిమజ్జన ఉత్సవాలను పురస్కరించుకుని ఉప్పల్ రింగ్ రోడ్డులో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న ప్రత్యేక స్వాగత వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ఉప్పల్ శాఖ కన్వీనర్ ఆకుల రాకేష్ తెలిపారు. గత పన్నెండు రోజులుగా అంగరంగ వైభవంగా పూజలందుకున్న గణనాథులను నిమజ్జనానికి తరలించే సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 25న ( నేడు) మధ్యాహ్నం ఒంటిగంట నుంచి నిమజ్జనానికి తరలివచ్చే గణేష్ విగ్రహాలకు ఉప్పల్ రింగ్ రోడ్డులోని స్వాగత వేదిక వద్ద ఘనంగా స్వాగతం పలుకుతామని ఆకుల రాకేష్ తెలిపారు.
గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చే పవిత్ర ఘట్టంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, మండప నిర్వాహకులు శాంతియుతంగా, సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. నిమజ్జనానికి తరలివచ్చే మండప నిర్వాహకులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖను సంప్రదించాలని ఆకుల రాకేష్ సూచించారు. గత పన్నెండు రోజులుగా భక్తుల పూజలు, విశేష కార్యక్రమాలతో కొలువుదీరిన విఘ్నేశ్వరుడికి ఘనమైన వీడ్కోలు పలికే ఈ పవిత్ర సందర్భంలో ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలు, ఐక్యత, ఆనందోత్సాహాలతో పాల్గొని గణేష్ నిమజ్జన ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.




# మోడల్ స్కూల్లో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



**చిట్యాల సెప్టెంబర్ 24 మీవార్త**

చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల /కళాశాల (మోడల్ స్కూల్ )లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ భూపాలపల్లి కోఆర్డినేటర్ యుగేందర్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు సమక్షంలో విద్యార్థిని విద్యార్థులచే పాఠశాల ప్రాంగణంలోమొక్కలు నాటించారు అదేవిధంగా పాఠశాల కళాశాల విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశం కోసం దేశ అభివృద్ధి కోసం దేశ శ్రేయస్సు కోసం యువత ముందుకు రావాలని సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలను ప్రపంచ పటలం చేస్తూ విషయ విజ్ఞాన జ్ఞానాన్ని పెంపొందించడానికి పర్యావరణ పరిరక్షణ పంచభూతాల పరిశుభ్రతయే మన లక్ష్యమని దేశ శ్రేయస్సు మన శ్రేయస్సు అని యువత భావించాలని అన్నారు అదేవిధంగా తోటి మానవులకి సహాయం చేయడం కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం మానవత దృక్పథానికి ఒక నిదర్శనం అని అన్నారు ఎన్ ఎస్ ఎస్ అంటే నేషనల్ సర్వీస్ స్కీమ్ అని ఇతరుల నుండి ఏ సహాయం ఆశించకుండానే ఇతరులకు మనం సహాయం చేయాలని అన్నారు అనంతరం విద్యార్థిని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు
ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నీలం రవీందర్ భాస్కర్ పుట్టరాజు ఆరేపల్లి రాము విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# అనుమతి లేకుండా డీజే సౌండ్ నిర్వహిస్తున్న వ్యక్తి పై కేసు

- ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు - ఇన్స్పెక్టర్ జలేందర్ రెడ్డి

**బోడుప్పల్ సర్కిల్ సెప్టెంబర్ 24 (మన మీ వార్త)**





మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పిడటి కాలనీలో బుధవారం రోజున రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో, మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కమాన్ రోడ్డులో అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే అక్కడ ఉన్న వ్యక్తిని ఆపి,డీజే నిర్వహణకు సంబంధించిన అనుమతి గురించి విచారించారు.అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తున్న వ్యక్తిని ప్రవీణ్ కుమార్, తండ్రి పేరు: విశ్వనాథ్, వయస్సు(34) సంవత్సరాలుగా గుర్తించారు. సదరు వ్యక్తి పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించాడు.ఈ విషయమై మేడిపల్లి పోలీసులు కేసు( సీఆర్ నెంబర్). 1371/26 నమోదు చేసి, అనుమతి లేకుండా వినియోగిస్తున్న డీజే, యాంప్లిఫైయర్ పరికరాలు ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగింది (ఎస్ హెచ్ ఓ) డి. జలేంధర్ రెడ్డి తెలిపినారు.

# పోలీసుకు ముప్పు కలిగించే ప్రయత్నాలు

**(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



ఓ పోలీస్ హోమ్ గార్డ్ కు ముప్పు కలిగించే విధంగా డ్రైవ్ చేసిన బొక్క దీపక్ కు ఆరు నెలల జైలుశిక్ష విదిస్తూ నిజామాబాద్ నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి దారావత్ దుర్గా ప్రసాద్ గురువారం తీర్పు చెప్పారు.తీర్పులోని వివరాలు నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు 2026,మార్చి 30 న సాయంత్రం నగరంలోని పవర్ హౌస్ చౌరస్తాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి తన బైక్ ను అజాగ్రత్తగా, అతివేగంగా డ్రైవ్ చేసుకుంటు రాగా అక్కడ విధులలో ఉన్న పోలీస్ హోమ్ గార్డ్ కాడాసి నర్సింగ్ బైక్ ను ఆపమని సూచిస్తూ వెళ్లగా బైకర్ వేగంగా వచ్చి టక్కర్ ఇవ్వడంతో నర్సింగ్ కిందపడి గాయలపాలయ్యాడు. అక్కడే విధులలో ఉన్న మిగతా పోలీసులు బైకర్ ను పట్టుకొని వివరాలు అడుగగా ఇందల్వాయి మండలం తిర్మన్ పల్లి గ్రామానికి చెందిన బొక్క దీపక్ గా తెలిపాడు.నర్సింగ్ పట్టణ ఐదవ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడంతో పోలీసులు నేర విచారణ పూర్తి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు.చార్జిషీట్ అనుసారం సాక్షుల సాక్ష్యాలు నమోదు చేసిన కోర్టు ముద్దాయి దీపక్ పై నేర అభియోగాలు రుజువైనట్లు తీర్పు వెలువరించింది.భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 125(ఎ ) ప్రకారం అధికారిక విధులలో ఉన్న వ్యక్తికి ముప్పు కలిగే విదంగా ఉన్న ముద్దాయి దీపక్ చర్యలు ఉన్నందున ఆరు నెలల సాధారణ జైలుశిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విదిస్తూ జడ్జి దుర్గా ప్రసాద్ తమ తీర్పులో పేర్కొన్నారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీరజ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

# పిల్లల ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేకదృష్టి

**(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



జిల్లాలో చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు భద్రతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న సంఘటనను దృష్టిలో ఉంచుకొని గురువారం ఆయన సీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణకు.. ఆస్పత్రుల్లో చిన్నారుల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. ప్రత్యేకంగా ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రుల్లో అగ్నిమాపక పరికరాల అందుబాటు, వాటి పనితీరు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం వ్యవస్థ, విద్యుత్ భద్రత, సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో రోగులను సురక్షితంగా తరలించే విధానం తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారులు చికిత్స పొందుతున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆసుపత్రుల యాజమాన్యాలు భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్, ఫైర్ సర్వీసెస్, వైద్య సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించే విధంగా అవసరమైన ఏర్పాట్లు, మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు.

**సురక్షితమైన వాతావరణం**

చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఆస్పత్రికి వచ్చే ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా.. ప్రభుత్వ , ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, ఫైర్ సర్వీసెస్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్, డీఎంహెచ్?వో రాజశ్రీ , జిల్లా ఫైర్ అధికారి పరమేశ్వర్, ఎన్?ఎస్?సీ ప్రెసిడెంట్ కవితారెడ్డి, డీసీహెచ్ఎస్ శ్రీనివాస ప్రసాద్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ పీవీ రాజేశ్వర్ రావ్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సీసీఆర్?బీ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, గురు నాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఇన్?స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

## శ్రీ గల్లి వినాయక అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాదం..



బోడుప్పల్ సర్కిల్ సెప్టెంబర్ 24 (మన మీ వార్త)



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ ఫేస్ - 3 కాలనీలో శ్రీ గల్లి వినాయక అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో, మంగళవారం సాయంత్రం అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గల్లి వినాయక అసోసియేషన్ అధ్యక్షులు సానిక శశి మాట్లాడుతూ... గత ఆరు సంవత్సరాల నుండి వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుపుకుంటున్నాము. శ్రీ వినాయకుడి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. శ్రీ గల్లి వినాయక అసోసియేషన్ కుటుంబ సభ్యులతో అన్నదాన ప్రసాదం ఘనంగా నిర్వహించినాము. అన్నదాన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బండారి విజయలక్ష్మి హాస్పిటల్ లో అన్నదానం..

(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



నిజామాబాద్ నగరం లోని గణనాథుల మండపాల వద్ద పూజాకార్యక్రమాలు అన్నదానాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బండారి విజయలక్ష్మి హాస్పిటల్ లో



గురువారం మహా అన్నదానం నిర్వహించారు.

**ప్రతి ఏడాదిలాగే..**

ఖలీల్ వాడీలోఉన్న బండారి గ్రూప్స్ విజయలక్ష్మి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యురాలు బండారి సుజాత, గాంధీ హాస్పిటల్ వైస్ ప్రిన్సిపాల్ నాగమోహన్ దంపతులు కలిసి వినాయకుడికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ఘనంగా వినాయకుడికి పూజా కార్యక్రమం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వినాయకుడికి కృపతో జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బండారి భోజన్న, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన మార్గాన్ని పరిశీలించిన మేయర్?



(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



నిజామాబాద్ నగరం లో గురువారం జరగనున్న గణపతి నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని మేయర్ కూరగాయల ఉమారాణి తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ తో కలిసి ఆమె రథయాత్ర ప్రారంభం కానున్న దుబ్బ నుంచి గణపతుల బావి వరకు రోడ్డుమార్గాన్ని పరిశీలించారు.

**భక్తులకు ఇబ్బందుల్లేకుండా..**

మేయర్ రథయాత్ర మార్గంలో.. అలాగే గణపతుల బావి వద్ద మార్గంలోని రోడ్ల పరిస్థితి, ట్రాఫిక్ సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, శోభాయాత్ర సజావుగా జరగడానికి అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. లోపాలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రేపు జరిగే నిమజ్జన శోభాయాత్ర భక్తులకు సురక్షితంగా, సజావుగా మరియు భక్తి భావంతో జరగాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, కార్పొరేటర్లు మనోహర్, నయీం, అమర్, సజ్జత్, కో-ఆప్షన్ సభ్యులు నరేందర్ సింగ్, అశోక్, అవిన్ పాల్గొన్నారు.

## మేడిపల్లి శాంతివనం పార్క్‌ను సందర్శించిన తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ శిక్షణార్థులు

**బోడుప్పల్ సర్కిల్ సెప్టెంబర్ 24 (మన మీ వార్త)** తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ శిక్షణార్థులు ఉప్పల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మేడిపల్లి శాంతివనం పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను పరిశీలించి, ఆఫ్రికన్ బాబాబ్‌తో పాటు



వివిధ మొక్కల నర్సరీ పెంపకం పద్ధతులపై శిక్షణ పొందారు.అనంతరం చెంగిచెర్ల రిజర్వ్ ఫారెస్ట్‌లోని బాబాబ్ చెట్లను కూడా శిక్షణార్థులు సందర్శించారు. బాబాబ్ చెట్ల సంరక్షణ, పెంపకం, వాటి ప్రత్యేకతలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎఫ్ఆర్ఓ శరత్ చంద్ర రెడ్డి, డి వై ఆర్ ఓ అనిత, ఎఫ్ బి ఓ ప్రీతి పూజ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొని శిక్షణార్థులకు అవసరమైన వివరాలను తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు

- పలు మండపాలను దర్శించుకున్న మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్..
- లింగమయ్య కాలనీలో ఘనంగా మహా అన్నదానం.. స్వామివారి ప్రసాదాన్ని స్వయంగా వడ్డించిన నరసింహ గౌడ్
- నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

పటాన్ చేరు సెప్టెంబర్ 24 మీ వార్త ప్రతినిధి :

అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. 11వ రోజు వేడుకల్లో భాగంగా అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ పలు కాలనీల్లో కొలువుదీరిన గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగమయ్య కాలనీలో భారీ అన్నదానం: ఈ సందర్భంగా లింగమయ్య కాలనీలోని గణేష్ మండపం వద్ద మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ సొంత ఖర్చులతో భారీ మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గణపతికి నైవేద్యం సమర్పించిన అనంతరం, నరసింహ గౌడ్ స్వయంగా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని వడ్డించారు. సుమారు 1500 నుండి 2000 మంది భక్తులు,



కాలనీవాసులు ఈ అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని

స్వీకరించారు. ఇంతటి ఘనమైన సేవా కార్యక్రమాన్ని చేపట్టినందుకు కాలనీవాసులు, భక్తులు నందారం నరసింహ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావాలి: నందారం నరసింహ గౌడ్ అనంతరం నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ... "నవరాత్రి వేడుకలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. గణనాథుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి. చివరి ఘట్టమైన నిమజ్జన శోభాయాత్రలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసుకోవాలి. ముఖ్యంగా శోభాయాత్రల సమయంలో పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆ విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నందారం రమేష్ గౌడ్, ఇంద్రేశం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎన్ఎన్‌జి యువసేన సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ లో గణనాథుడికి ఘనంగా పూజలు..

(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



నిజామాబాద్ నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో నగరపాలక సంస్థ గణేష్ మండలి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**ఉత్సవాలతో సేవా కార్యక్రమాలకు ఊతం..**

ఈ సందర్భంగా మేయర్ ఉమారాన్ని మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించడం ద్వారా సేవా కార్యక్రమాలకు నిర్వహించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. నగరపాలక సంస్థ గణేష్ మండలి ద్వారా నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం పేదలు, అవసరమైన వారికి ఆహారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. సమాజ సమరసత, సేవా భావం పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని సూచించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, డీసీసీ ప్రెసిడెంట్ నాగేశ్ రెడ్డి, సిటీ ప్రెసిడెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు

(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో "అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ -- రోడ్ సైక్లింగ్" పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జీవీ కృపాకర్ రెడ్డి, భూలోకం విజయ్ కాంత్ రావు తెలిపారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**ఆసక్తి పెంచేందుకు..**

మహిళల్లో సైక్లింగ్ క్రీడపై ఆసక్తిని పెంపొందించడం, వారి ప్రతిభను వెలికితీయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళా ఎలైట్ విభాగంలో 19 నుండి 40ఏళ్ల మధ్య ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. ?జూనియర్ బాలికల విభాగంలో 15 నుండి 18ఏళ్ల వయస్సు గల బాలికలు (2008-2011 మధ్య జన్మించిన వారు) అర్హులని పేర్కొన్నారు.

**నిబంధనలివే..**

క్రీడల్లో పాల్గొనే క్రీడాకారిణులు తమ సొంత సైకిళ్లు, రక్షణ పరికరాలను తెచ్చుకోవాలని ప్రతినిధులు పేర్కొన్నారు. పోటీదారులకు 'ఖేలో ఇండియా గుర్తింపు సంఖ్య' తప్పనిసరని.. గుర్తింపు సంఖ్య లేనివారు 'ఎన్ఎస్ఆర్ఎస్' అంతర్జాల వేదిక ద్వారా నమోదు చేసుకుని గుర్తింపు పొందాకే పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ?విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో పాటు ప్రతిభా పత్రాలు అందజేస్తామన్నారు. ?ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, సుబేదార్ సూర్యప్రకాష్, కోశాధికారి సురేందర్ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు జనరల్ సెక్రటరీ బి. విజయ్ కాంత్ రావు (9912883331)ను సంప్రదించాలని సూచించారు.

## కాసిపేటలో ఉత్సాహంగా గణపతి నవరాత్రి వేడుకలు.. ఆటల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

కాసిపేట, సెప్టెంబర్ 24: (మన మీ వార్త మండల ప్రతినిధి)



గణపతి నవరాత్రుల ఎడుకలను పురస్కరించుకుని కాసిపేట మండలంలో యువత, మహిళలు చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహించారు. వార్డు మెంబర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఏల్పుల గంగా బుచ్చయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ పోటీల్లో స్థానిక యువకులు, మహిళలు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల అనంతరం విజేతలకు నిర్వాహకులు ఏల్పుల గంగా బుచ్చయ్య చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గణపతి నవరాత్రుల వేడుకలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను ప్రతీ ఏటా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత, మహిళలు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## ములుగు జిల్లా వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు

వృద్ధుల సంరక్షణపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,



శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క గురువారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులతో వృద్ధుల ముఖాముఖి కార్యక్రమాలు, నాటి ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు, యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే జిల్లా స్థాయి వయోవృద్ధుల దినోత్సవానికి వృద్ధులతోపాటు వారిని సంరక్షించే కుటుంబ సభ్యులు సైతం హాజరు కావాలని కోరారు. వృద్ధుల అవసరాలు, సమస్యలను గుర్తించి వారి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ ప్రేమలత, వయోవృద్ధుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.ం

## ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి ఆర్థిక భరోసానివ్వాలి

**సోనాల** : సొనాల మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన జాదవ్ సూసింద్ అనే కౌలురైతు గత కొన్ని రోజుల క్రితం సాగు చేస్తున్నా



పంట పొలం లోనే పురు గుల మందుతాగి ఆత్మహత్మ చేసుకున్న కుటుంబాన్ని రైతు స్వరా జ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న తో పాటు షారుక్ కలిసి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని కలిసి వాస్తవ ఆర్థి క స్థితిగతులపై కుటుంబ సభ్యుల నుండి సమాచారం తీసుకుం టూ, తాను తీసుకున్న కౌలు భూమి 4 ఎకరాల భూమిని కౌలుకి తీసుకొని వ్యవసాయం చేస్తున్నా సందర్భంలో తను సాగుచేస్తున్న పంట భూమిలో పత్తికట్టే తీస్తున్న క్రమంలో పంటలకు అయినా ఖర్చులకి మరియు గత ఏడాదిలో ఆశించినంత పంట దిగుబడి రాక వారి కుటుంబ సభ్యుల ద్వారా సమాచారాన్ని అడిగి తెలుసుకోవడం జరిగింది. వాస్తవంగా గత సంవత్సరం ఆగస్టు 16 నుండి నవంబర్ 04 వరకు కురిసిన అతి భారీ వర్షాలకి పంటాం తాయు ఎదుగకుండా మరొక పక్క ప్రకృతి విపత్తుల ద్వారా పంటలకి అధిక వర్షపాతలు నమోదు కావడంతో తాను సాగుచేసిన పంట భూమిలో ఆశించినంత పంట దిగుబడి రానందున మరియు ఈ ఖరీఫ్‌లో ఆశించినంత పంట ఎదుగుదల లేకపోవడంతో మనోవేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు..



బోడుప్పల్ సర్కిల్ సెప్టెంబర్ 24 (మన మీ వార్త) శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లడ్డు వేలం 65, 501 / దక్కించుకున్న ప్యారపు బిక్షపతి శారద దంపతులు

# జనగామ గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా 'వికసిత్ గ్రామ పంచాయతీ' ప్రణాళిక

- గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను సమర్థంగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ఎల్నినో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ జలసిరి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల అమలుపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాగురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన వీబీజీ--రామ్‌జీ 125 రోజుల ఉపాధి పని గ్యారంటీ, ఎల్నినో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే ప్రణాళిక, తెలంగాణ జలసిరి పనులపై బచ్చన్నపేట, తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ తయారీ, అమలు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో బావులు, బోర్ వెల్, ఇరిగేషన్ ఛానళ్లు, డిస్ట్రిబ్యూటరీ ఛానళ్ల నిర్మాణం, స్ప్రింక్లర్, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు, బోర్ వెల్ వాటర్ ఆటోమేషన్ సెన్సర్ల ఏర్పాటు వంటి పనులను చేపట్టవచ్చని తెలిపారు. అలాగే చెక్ డ్యామ్‌లు, రీఛార్జ్ పిట్లు, చెరువుల పునరుద్ధరణ, అండర్ గ్రౌండ్ డైక్స్ వంటి నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామీణ రోడ్లు, డబ్ల్యూబీఎం రోడ్లు, సీసీ రోడ్లు, కల్వర్టులు, క్రాస్ డ్రైనేజ్ స్ట్రక్చర్లు, ఫుట్ ఓవర్ పాత్ వేలు, పేవర్ బ్లాక్ ఫుట్‌పాత్‌లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు, ల్యాబొరేటరీలు, కాంపౌండ్ వాల్లు, క్రీడా మైదానాల నిర్మాణం, మరమ్మతులు కూడా ఈ పథకం ద్వారా చేపట్టవచ్చని వివరించారు. రైతు వేదికలు, వైకుంఠధామాలు, శ్మశానవాటికలు, వ్యక్తిగత, కమ్యూనిటీ



సోక్ పిట్లు, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చాంబర్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్, రీసైక్లింగ్ ప్లాంట్లు, చెత్త సేకరణ పిట్లు, సెగ్రిగేషన్ షెడ్లు, బయో ఫర్టిలైజర్ స్టోరేజ్ యూనిట్లు, బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ లైట్లు ఏర్పాటు వంటి పనులను కూడా చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు.

ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు గ్రామాల అవసరాలకు అనుగుణంగా సర్పంచులతో సమన్వయం చేసుకొని పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. కూలీల సమీకరణకు ప్రాధాన్యత ఇచ్చి గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు.

వ్యవసాయం, నీటి సంరక్షణ, ఉద్యానవనం, అటవీకరణ, గ్రామీణ రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టులు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రీసైక్లింగ్ ప్లాంట్లు, బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ లైట్లు, తదితర అనేక అభివృద్ధి పనులను గ్రామ పంచాయతీలు చేపట్టవచ్చని తెలిపారు.

గ్రామాల అవసరాలను గుర్తించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పనులను ఎంపిక చేసుకోవాలని, కొత్త నిర్మాణాలతో పాటు ఇప్పటికే ఉన్న మౌలిక వసతులకు మరమ్మతులు, నిర్వహణ పనులను కూడా చేపట్టవచ్చని చెప్పారు. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా వీబీజీ--రామ్‌జీ పథకం కింద 125 రోజుల పనులను సమర్థంగా అమలు చేయాలని తెలిపారు.

ఎల్‌నినో కారణంగా తలెత్తే వర్షాభావ పరిస్థితులను



దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ పనులు, చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యాంలు, రీచార్జ్ పిట్లు, డ్రిప్ ఇరిగేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని కార్యాచరణ ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

దీని కింద వెదురు, మ్యాంగ్రోవ్, మియావాకి, కొబ్బరి, రబ్బర్, బయో డ్రైనేజ్, బ్రూమ్, తదితర మొక్కల పెంపకాన్ని చేపట్టవచ్చని చెప్పారు.

అదే విధంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికపై చేపట్టగల వివిధ పనులపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించి, అవగాహన కల్పించారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో డీఆర్‌డీఓ భాస్కర్, అదనపు డీఆర్‌డీఓ సూరి, ఎఫ్‌ఆర్‌ఓ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీపీఓ వెంకట్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి రాణా ప్రతాప్, డీవీహెచ్‌ఓ మురళీధర్ రావు, ఈఈ పీఆర్ రవీందర్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీకాంత్, డీహెచ్‌ఎస్‌ఓ నర్సయ్య, బచ్చన్నపేట, తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కొనసాగిన గణేశుడి శోభయాత్ర



జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం రోజున గణేశుడు శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది.తొమ్మిది రోజులు ఘనమైన పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు.పలు మండ పాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డు వేలం నిర్వహించారు. మహిళలు,యువతి యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ గణ నాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. చేరుకున్నాడు.పలు మండ



పాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డు వేలం నిర్వహించారు. మండల కేంద్రంలో ని ఆర్యవైశ్య సంఘం మరియు వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలంలో మాదంశెట్టి భూమేష్ అండ్ బ్రదర్స్ పాల్గొని రూపాయలు 41 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.ఆ గ గణనాథుడి వద్ద శోభాయాత్ర నిమజ్జనం కోసం వాహనాన్ని అలంకరించిన తీరు , మహిళలు, యువతీ యువకులు చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.శోభాయాత్ర అనంతరం సమీపంలోని చెరువులు గోదావరిలో గణేషుడిని నిమ్మజ్జనం చేశారు.భారీ వర్షం పడిన, కరెంట్ లేకపోయినా గణేశుడి శోభయాత్ర మాత్రం భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగింది,శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# రెడ్?క్రాస్ సంస్థ ఎన్నికలకు 29 నామినేషన్లు

(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

నిజామాబాద్ నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికల ప్రక్రియ జోరందుకుంది. ఈ సందర్భంగా భాగంగా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు.



**15పోస్టులకు గాను.. 29 నామినేషన్లు..**

ఈ సందర్భంగా మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి 15 పోస్టులకు గాను మొత్తం 29 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నామినేషన్లను ఎన్నికల అధికారి, జిల్లా సహకార అధికారి ఎన్ శ్రీనివాస్ రావు స్వీకరించారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి తదుపరి ప్రక్రియను ఎన్నికల షెడ్యూల్ ప్రకారం కొనసాగించనున్నట్లు ఆయన వివరించారు.

# మహబూబాబాద్ జిల్లా రెవెన్యూ - అటవీ భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,

మన మీ వార్త సెప్టెంబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

అటవీ శాఖ అధికారి బి.లావణ్య లతో కలిసి మహబూబాబాద్ నియోజకవర్గం భూ సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించిన :: శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి



నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని గూడూరు, కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, మహబూబాబాద్, లలో ఉన్న భూ సమస్యలను పరిశీలించి తమ పరిధిలో ఉంటే తక్షణమే పరిష్కరించాలన్నారు, ప్రతి మాసం సమన్వయ సమావేశం నిర్వహించాలని ఎమ్మెల్యే గారు సూచించారు. గూడూరు మండలం గుండెంగా భూ సమస్య, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా సమస్య పరిష్కారం, నెల్లికుదురు మండలం జాంగ్ సిపాయి భూముల సమస్య, కేసముద్రం మండలం ఆలేరు, నరసింహుల గూడెం , ఇనుగుర్తి లలో గుర్తించబడిన సమస్యలను పరిష్కరించాలని, మహబూబాబాద్ మండలంలో ఎక్స్ సర్వీస్ మెన్, లకు కేటాయించిన భూములను పరిరక్షించాలని, తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డిఆర్ఓ నాగలక్ష్మి, మహబూబాబాద్ తొర్రూరు ఆర్డీవోలు రాజేశ్వరి, గణేష్, మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు, ఇనుగుర్తి, నెల్లికుదురు, తహసీల్దారులు రాజేశ్వర్, గుండు వివేక్, నాగ భవాని, రాజు, నలిని, కలెక్టరేట్ సూపర్డెంట్ మదన గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# కాచిగూడ రైల్వేస్టేషన్ కొత్త సొబగులు

**హైదరాబాద్ :** భాగ్యనగర చారిత్రక శోభకు, నిజాం కాలం నాటి నిర్మాణ వైభవానికి ప్రతీకగా నిలిచే కాచిగూడ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూనే ప్రయాణికులకు ఆధునిక సదుపాయాలు అందించేలా స్టేషన్ పునరాభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే ప్రాథమిక ప్రణాళిక సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ కాన్సెప్ట్ ప్లాన్ ప్రకారం సుమారు రూ.474.29 కోట్ల అంచనా వ్యయంతో స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఇది కేవలం డ్రాఫ్ట్ ప్లాన్ మాత్రమేనని, తుది ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న పురాతన హెరిటేజ్ భవనాన్ని యథాతథంగా పరిరక్షించాలని ప్రతిపాదించారు. అదే సమయంలో తూర్పు వైపు, అంబర్‌పేట వైపున ఆధునిక టెర్మినల్ భవనాన్ని నిర్మించేలా డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించారు. దీంతో పాత నిర్మాణానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూనే కొత్త అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను విస్తరించే అవకాశం ఏర్పడుతుంది. ప్లాట్‌ఫాంల పైన 72 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో విశాలమైన ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో ఫుడ్ కోర్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రదర్శన హాళ్లు, పిల్లల ఆట స్థలాలు వంటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండే సమయంలో మెరుగైన సౌకర్యాలు పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు.స్టేషన్‌లో రద్దీని తగ్గించి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడంపై కూడా ప్రణాళికలో దృష్టి పెట్టారు. రైలు ఎక్కే ప్రయాణికులు, రైలు దిగే ప్రయాణికులు ఒకరికి ఒకరు అడ్డంకిగా మారకుండా విడివిడిగా మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్ స్టేషన్‌తో మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు స్కైవాక్ నిర్మాణాన్ని కూడా ప్రతిపాదించారు. పశ్చిమ, తూర్పు వైపుల వాహనాల పార్కింగ్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. రైలు, బస్సు, వ్యక్తిగత వాహనాల రాకపోకలను సమన్వయం చేసేలా మల్టీమోడల్ కనెక్టివిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది

# దసరా నాటికి పదవులు పంపకం

**నల్గొండ :** రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో, అధికార కాంగ్రెస్ పార్టీ అందుకు తగ్గట్టు ప్రణాళికలు రచిస్తోంది. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు త్వరలోనే పదవుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడానికి పార్టీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా ఈ నియామకాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ సాగుతోంది. ఇందులో భాగంగానే వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాలు, ఖంఆా, మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల నియామక ప్రక్రియను వేగవంతం చేశారుఇటీవల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పార్టీ అధిష్టానంతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ భేటీలో ఆశావహుల జాబితాను హైకమాండ్‌కు సమర్పించినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నియామకాలపై తుది నిర్ణయం వెలువడనుంది. విజయదశమి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, కార్యకర్తలకు దసరా కానుకగా అందించాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.గత ఎన్నికల నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులు, గ్రాస్‌రూట్ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

# మోదీ, అమిత్ షా, సీఈసీ దేశ ద్రోహులు

దేశంలో ఓటు హక్కును, ఎన్నికల ప్రక్రియను నాశనం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ 'దేశద్రోహులు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశానికి వారు చేసిన ద్రోహానికి మోదీ, అమిత్ షాపై విచారణ జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. సీఈసీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 2024 తర్వాత జరిగిన సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై ఇతర కమిషనర్లు చేసిన ఆరోపణలపై రాజకీయంగా పెను దుమారం రేగుతున్న వేళ.... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపించారు. జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎంపిక చేశారన్న రాహుల్ రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ ఆయన్ను వారు కాపాడుతున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికలకు ముందు సీఈసీపై చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓ చట్టం తెచ్చారని రాహుల్ వెల్లడించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయని రాహుల్ ఆరోపించారు. ఈ క్రమంలో ఓటు చోరీ.. చివరకు చట్టం చోరీగా మారుతోందని పేర్కొన్నారు. బీజేపీ 30 నుంచి 50 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని మోదీ, అమిత్ షా చెబుతున్నారని రాజకీయాల్లో ఏ నాయకుడు కూడా ఇలా చెప్పరని వివరించారు.



"నేను ఓ రాజకీయ కుటుంబంలో 50ఏళ్లకుపైగా ఉన్నాను. ఏ ప్రజాస్వామ్య వాతావరణంలోనైనా పనిచేసే రాజకీయ నేత ఇలాంటి ప్రకటన చేయలేరు. ఎందుకంటే దేశంలో ప్రభుత్వ వ్యతిరేకత అనే కీలక శక్తి ఉంది. ఏ ప్రభుత్వంపైనైనా వ్యతిరేకత మొదలవుతుంది. అది ఎవరినీ విడిచిపెట్టదు. ఇందిరాగాంధీ బంగ్లాదేశ్ యుద్ధంలో గెలిచి ప్రజాదరణలో శిఖరాగ్రంలో ఉన్నప్పుడు కూడా ఒకటి రెండేళ్లలోనే తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. అలాంటి పరిస్థితే ఎందరో నేతలు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ నేతలతోపాటు ప్రాంతీయ పార్టీలకు కూడా అది జరిగింది. కానీ, ఏవో కారణాల వల్ల నరేంద్రమోదీకి గానీ, అమిత్ షాకు గానీ, బీజేపీకి గానీ అలాంటి పరిస్థితి ఎదురుకావటం లేదు. నేను గాలిలో మాటలు చెప్పటం లేదు. ఆధారాలతోనే చెబుతున్నాను. ఇది 100శాతం నిజం అని నిరూపించటానికి ఇప్పటికే తగినంత సమాచారం ఉంది. దేశ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు, 2024 ఎన్నికలు, శాసనసభ ఎన్నికలు.. అన్నీ కూడా రిగ్గింగ్ అయ్యాయి. ఈ కుట్రలో.. ఆ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న వ్యక్తులనే మనం కుట్రదారులుగా పరిగణించాలి"

**ప్రజాస్వామ్యం ధ్వంసం అవుతుంటే చూస్తూ ఊరుకోబోం**

ఓటు చోరీ ద్వారా ఎన్నికైన ఎంపీలు చేసే చట్టాలు అక్రమమని రాహుల్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియనే దొంగిలిస్తున్న మోదీ, అమిత్‌షాపై విచారణ జరగాలన్న ఆయన, ప్రజాస్వామ్యం ధ్వంసం అవుతుంటే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియ ప్రభుత్వ నియంత్రణకు అతీతంగా ఉండాలని తాను చేసిన సూచనను మోదీ సర్కార్ బుట్టదాఖలు చేసిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. మోదీ సర్కార్ చేస్తున్న నేరంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. దేశంలో అధికార వ్యతిరేకత అనే ఒక ప్రాథమిక శక్తి ఉంటుందని, అది తిరగబడటం మొదలుపెడితే ఎవరినీ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. "జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి. మీరు చేసిన ఈ పని దేశానికి వ్యతిరేకంగా చేసిన ద్రోహం. ఇది కేవలం ఏదో చిన్న ఎన్నికల రిగ్గింగ్ కాదు. ఇది దేశ రాజ్యాంగంపై జరిగిన దాడి. మనదేశ న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి. పైగా ఓటు హక్కును రక్షించాల్సిన బాధ్యత గల వ్యక్తి మీరే. దేశంలో ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే మేం మౌనంగా కూర్చోం. అందుకు బాధ్యులైన వారికి కచ్చితంగా శిక్ష పడుతుంది. ఈరోజు కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి అయినా సరే వారు శిక్ష అనుభవించక తప్పదు"

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు సిద్ధమైన విపక్షాలు

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఈ క్రమంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు సిద్ధమయ్యాయి. ఎన్నికల సంఘంలోనే విభేదాలు ఉన్నట్లు జాతీయ మీడియాల్లో వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయనను తొలగించాలని కోరుతున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ ఉభయ సభల్లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఈ అభిశంసన తీర్మానం నోటీసులకు సంబంధించి ముసాయిదా రూపొందించే పనిలో ఉన్నారని, న్యాయ నిపుణుల పరిశీలన తీసుకొని ఒకటి రెండు వారాల్లోగా లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రధానంగా సర్ ప్రక్రియ చుట్టూ తలెత్తిన వివాదాలే ఈ పరిణామానికి కారణంగా నిలిచాయి. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ వంటి అంశాలపై ఎన్నికల కమిషన్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని ఇటీవల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ ప్రకారం– ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల వ్యవధిలోనే ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఇంకా కొన్ని సౌకర్యాలకు సంబంధించిన యాక్సెస్ కోసం గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, దిల్లీలోని ఎన్నికల సంఘం అధికారులను 7 రోజుల్లో 8 సార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాలేదని మరో నివేదికలో తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం పనితీరుపై



కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

**సీఈసీపై తృణమూల్ ఎంపీ ఫిర్యాదు**

మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా గురువారం దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో సీఈఓ జ్ఞానేశ్ కుమార్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏకపక్ష నిర్ణయాలు, విధివిధానాల ఉల్లంఘన, ఓటరు జాబితాల్లో మార్పులకు సంబంధించి అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆమె ఆరోపణలు చేశారు. సీఈసీ అండ్ ఈసీ యాక్ట్ 2023 సెక్షన్ 16 కింద, ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లు కలిసి తీసుకునే ఉమ్మడి నిర్ణయాలకే చట్టపరమైన రక్షణ (ఇమ్యూనిటీ) వర్తిస్తుందని, ఒంటరిగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న సీఈసీకి ఈ రక్షణ వర్తించదని ఆమె వాదించారు. కాంగ్రెస్ సీనియర్ నేత ప్రమోద్ తివారీ కూడా ఎన్నికల కమిషన్ తాజా నిర్ణయాలపై తీవ్రంగా విమర్శించారు. సీఈసీపై వస్తున్న ఆరోపణలకు ఎన్నికల కమిషన్ లేదా సీఈసీనే సమాధానం ఇవ్వాల్సి ఉండగా, బీజేపీ నేతలు ఎందుకు స్పందిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఆయనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ చేయాలని కోరారు. ఈ ఎస్ఐఆర్ కారణంగా 19 రాష్ట్రాల్లో ఏకంగా 13 కోట్ల మందిని ఓటరు లిస్ట్ నుంచి తొలగించారని, కర్ణాటకలోనే 1.08 కోట్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. మరో 43 లక్షల మందికి నోటీసులు కూడా ఇచ్చారని మండిపడ్డారు. సీఈసీని తొలగించడానికి ప్రతిపక్షాలు సిద్ధపడటం ఇదేం తొలిసారి కాదు. గతంలోనూ ఇది జరిగింది. ఈ ఏడాదే మార్చిలో ఒకసారి, మళ్లీ ఏప్రిల్‌లో కూడా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని నోటీసులు సమర్పించాయి. అయితే అప్పుడు సరైనంత సంఖ్యాబలం లేకపోవడం, ఇతర ప్రక్రియల నేపథ్యంలో అవి తిరస్కరణకు గురయ్యాయి. ప్రస్తుతం మరోసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి.

**అంత సులభమేం కాదు!**

ఇక అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని పదవీకాలం పూర్తికాకముందే తొలగించాలనే ప్రతిపాదనను పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని అభిశంసన తీర్మానం అంటారు. అయితే భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటే అనుసరించాల్సిన ప్రక్రియ కూడా చాలా కఠినంగానే ఉంటుంది. పార్లమెంట్ ఉభయసభల్లోకి వచ్చే అభిశంసన నోటీసును ముందుగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ ఛైర్మన్ పరిశీలించి, నోటీసును అంగీకరిస్తే వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. విచారణ జరిపి, ఆరోపణల్లో నిజం ఉందని నివేదిక ఇస్తేనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తారు. అక్కడ మళ్లీ మూడింట రెండొంతుల మెజార్టీతో తీర్మానానికి ఆమోదం లభించాలి. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం కూడా లభించాలి.

# ఎంత అధికారం వచ్చినప్పటికీ సేవా మార్గాన్ని వీడం

రాజకీయాల్లో ఎంత ఎత్తుకు ఎదిగినా ప్రజాసేవే తమకు ప్రధాన మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గుజరాత్ నుంచి దిల్లీ వరకు తమ పాలన, విలువలకు సేవే మూలాధారమని చెప్పారు. ఎంత రాజకీయ అధికారం వచ్చినా సేవా మార్గం నుంచి వైదొలగబోమని పేర్కొన్నారు. 'సేవా సంకల్ప్ యాత్ర' భాగంగా వడనగర్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి వరకు బైక్ యాత్ర చేపడుతున్న సేవా యాత్రికులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

పాలనలో సేవా భావం ఉన్నప్పుడు ప్రతి విధానంలోనూ 'నాగరిక్ దేవో భవ అనే స్ఫూర్తి ప్రతిబింబిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రాథమిక లక్ష్యంగా ఉండాలని యాత్రికులకు సూచించారు. సేవ గురించి కేవలం ప్రసంగాలు చేయడం కాకుండా, తమ ఆచరణ ద్వారా దాని సందేశాన్ని ప్రజలకు అందించాలని మోదీ సూచించారు. ప్రజలకు సేవ చేస్తే, ఆ సేవే సందేశంగా మారుతుందని చెప్పారు. 'సేవా పరోమో ధర్మః' అనే భావనతో ముందుకు సాగాలని యాత్రికులకు పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఎంత అధికారం లభించినా, ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా, తమ ప్రాథమిక మార్గం మాత్రం సేవగానే ఉండాలని అన్నారు.

**ప్రజల ఆశీస్సులే బలం**

తన జీవిత ప్రయాణానికి ప్రజల ఆశీస్సులే ప్రధాన శక్తిగా నిలిచాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'సేవా భావంతో చేసిన పనులను ప్రజలు గుర్తుంచుకుంటారు. సేవ చేసే వారికి ప్రజల ఆశీస్సులు లభిస్తాయి. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో యువశక్తి పాత్రను మనం అత్యంత బలంగా ముందుకు తీసుకెళ్లాలి. నేటి యువతరమే వికసిత్ భారత్‌కు నిర్మాతలు, అలాగే ఈ అభివృద్ధి ఫలాలను అత్యధికంగా పొందే లబ్ధిదారులు కూడా వారే. ఈ బాధ్యతను నెరవేర్చాలంటే.. క్షేత్రస్థాయిలో భారతదేశాన్ని తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం, ప్రతీ సూక్ష్మాంశాన్ని అనుభూతి చెందడం ఎంతో అవసరం. వివిధ ప్రాంతాలు, విభిన్న సామాజిక వర్గాల ప్రజలను కలవడం, వారి కలలు, ఆకాంక్షలను



తెలుసుకోవడం, వారి మాటలను వినడం లాంటివన్నీ చాలా ముఖ్యం. ఈ క్రమంలో మీ జీవితంలో సేవా సంకల్ప యాత్ర కచ్చితంగా ఒక కీలక పాత్ర పోషించనుంది' అని ప్రధాని మోదీ తెలిపారు. యాత్రలో పాల్గొంటున్న వారిని అభినందిస్తూ, తమ ఆరోగ్యం, భద్రతపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ప్రయాణంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

**20 బృందాలు– 35,500 కిమీ ప్రయాణం**

'సేవా సంకల్ప్ యాత్ర'లో మొత్తం 20 బృందాలు భాగస్వాములవుతున్నాయి. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 7 వరకు సుమారు 35,500 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది. వడనగర్ నుంచి వారణాసి అక్కడి నుంచి తిరిగి వడనగర్ వరకు ఈ బృందాలు ప్రయాణించనున్నాయి. ఇది కేవలం మోటార్‌సైకిల్ యాత్ర మాత్రమే కాదని నిర్వాహకులు చెబుతున్నారు. పట్టణాలు, జిల్లాలు, తాలూకాలు, గ్రామాల్లో ఆగుతూ స్థానిక ప్రజలను కలుసుకుని, అక్కడి అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేపట్టేలా యాత్రను రూపొందించారు. యాత్రలో భాగంగా చెరువులు, ఆలయాలు, పాఠశాలలు, పార్కులు, ఆసుపత్రులు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టనున్నారు. లబ్ధిదారులతో సమావేశాలు, యువతతో చర్చలు, గ్రామసభలతో సంభాషణలు నిర్వహించనున్నారు. అదేవిధంగా గోసేవ, మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం కింద వృక్షారోపణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రధాని మోదీ జన్మదినం, ఆయన ప్రజాప్రతినిధిగా 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 17న ప్రారంభమైన 'సేవా సంకల్ప్ అభియాన్'లో సేవ, ప్రజల భాగస్వామ్యం, దేశ నిర్మాణం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## బీజేపీలో భారీ సంస్థాగత మార్పులు




బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్‌ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు.

**ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే..**

మహారాష్ట్రకు అజయ్ జమ్వాల్, బీహార్‌కు భిఖూభాయ్ దల్సానియా, ఝార్ఖండ్‌కు పవన్ సాయి, గుజరాత్‌కు రత్నాకర్, ఉత్తరాఖండ్‌కు ఫణీంద్రనాథ్ శర్మ, పంజాబ్–చండీగఢ్‌కు మంత్రి శ్రీనివాసులు, ఉత్తరప్రదేశ్‌కు ధరమ్‌పాల్, పశ్చిమ బెంగాల్‌కు అమితాబ్ చక్రవర్తిని రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. అసోం, త్రిపుర రాష్ట్రాలకు రవీంద్ర రాజు, హిమాచల్ ప్రదేశ్‌కు సిద్ధార్థన్, ఢిల్లీ–హర్యానాకు పవన్ రాణా, ఛత్తీస్‌గఢ్‌కు కరమ్‌వీర్, మధ్యప్రదేశ్‌కు చంద్రశేఖర్, ఒడిశాకు మానస్ మహంతిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలకు సంబంధించిన సర్క్యులర్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్ని రాష్ట్ర శాఖలకు పంపించారు.

## కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం..



కేంద్ర ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాల వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఎస్ఐఆర్ సహా ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. దీంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాల విమర్శలు మరింత పెరిగాయి.

ఇప్పటికే కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కూడా రంగంలోకి దిగింది. జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అల్టిమేటం ఇచ్చారు. గడువులోగా రాజీనామా చేయకపోతే ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ఈ క్రమంలో, సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ తమ డిమాండ్లను వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతో పాటు ఆయనకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలను 2025 నాటి స్థాయికి పునరుద్ధరించాలని కోరారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫైళ్లను సుప్రీంకోర్టు నేతృత్వంలోని కమిటీ అధీనంలో ఉంచాలన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. గతంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారం, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా కూడా సీజేపీ ఇలాంటి ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి వారి డిమాండ్లను నెరవేర్చింది. తాజాగా ఎన్నికల సంఘంపై ఆందోళనకు పిలుపునివ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇక పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు ముందు ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగా పశ్చిమ బెంగాల్‌లో తాజా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా విపక్షాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కూడా సీఈసీ రాజీనామా డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నేతలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలకు తాజా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం బలం చేకూర్చుతోందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్ హయాంలో ఇకపై ఎన్నికలు నిర్వహించకూడదనిడిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలోనే నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదైనట్లు వచ్చిన సమాచారం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మరింత తీవ్రంగా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతో పాటు జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లు నమోదు చేసిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు, రాతపూర్వక అభిప్రాయాలు నమోదు కావడం అంతర్గత చర్చల్లో సాధారణమేనని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌తో పాటు గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది. ఇదే సమయంలో బీజేప విపక్షాల విమర్శలను తప్పుబట్టింది. ఎన్నికల కమిషనర్ల మధ్య చర్చలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమేనని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ విషయంలో తుది నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని చెప్పారు. దీంతో సీఈసీపై విపక్షాల విమర్శలు ఒకవైపు, ఎన్నికల సంఘం వివరణ మరోవైపు కొనసాగుతున్నాయి. ఇప్పుడు సీజేపీ ఇచ్చిన 48 గంటల గడువు ఈ వ్యవహారానికి కొత్త మలుపు తీసుకొచ్చింది. గడువు పూర్తయ్యాక సీజేపీ ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది? ఇతర విపక్ష పార్టీలు దానికి మద్దతు ఇస్తాయా? దేశవ్యాప్త ఆందోళనలకు ఈ అంశం దారితీస్తుందా? అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# హైదరాబాద్ నుంచి నందిగామ వరకే

-మొదటిపేజీ తరువాయి

త్వరలోనే కమిటీ ముందుకు ఈ ప్రాజెక్టు ఫైల్ వెళ్లనుందని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు వెల్లడించాయి. అనుమతులు వచ్చేంత లోపు, టెండర్ల ప్రక్రియను ఆరంభించినట్లు తెలిపాయి.



### హైదరాబాద్ నుంచి నందిగామ వరకే

హైదరాబాద్ శివారు ప్రాంతమైన మల్కాపూర్ నుంచి నందిగామ వరకు 181.300 కిలోమీటర్లు ఆరు వరుసలుగా విస్తరణ, ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని ఒక ప్యాకేజీగా చేపట్టారు. వీటి సివిల్ పనుల కోసం రూ.6,792.52 కోట్ల అంచనాతో టెండర్లు ఆహ్వానించారు. నిర్మించు(బిల్ట్), నిర్వహించు(ఆపరేట్), బదలాయించు(ట్రాన్స్?ఫర్)(బీవోటీ) విధానంలో ఈ పనులను చేపట్టనున్నారు. నవంబరు 23వ తేదీ వరకు బిడ్లు దాఖలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. నవంబరు 25న బిడ్లను తెరవనున్నారు. ఈ ప్యాకేజీలో మల్కాపూర్ నుంచి చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, సూర్యాపేట, నకిరేకల్, నవాబుపేట, కోదాడ, నందిగామ వరకు రహదారి విస్తరణ పనులు జరుగనున్నాయి. ఇందులో 60 వాహనాల అండర్‌పాస్‌లు (వీయూపీలు), జంతువులు రోడ్డు దాటడానికి వీలుగా మరో 10 అండర్‌పాస్‌ల నిర్మించనున్నారు.

నందిగామ ప్రాంతం నుంచి విజయవాడ గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ వరకు రహదారి విస్తరణకు సంబంధించి ప్రస్తుతం టెండర్లను ఆహ్వానించలేదు. ఈ ప్యాకేజీలో హైవే నిర్వహణ బాధ్యతలను చూస్తున్న గుత్తేదారు సంస్థకు 2031 వరకు గడువు ఉంది. ఆ సంస్థతో ఎన్?హెచ్?ఏఐ చర్చలు జరిపిన అనంతరం, దీనిపై నిర్ణయం తీసుకొని ముందు టెండర్లను ఆహ్వానించనున్నట్లుగా సమాచారం.

హ్యామ్ కింద విజయవాడ-మచిలీపట్నం మధ్య విస్తరణ

మరో ప్యాకేజీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగర పరిధిలో కానూరు వద్ద సిద్ధార్థ కళాశాల నుంచి మచిలీపట్నం వరకు హైవేను విస్తరించనున్నారని సమాచారం. కానూరు సిద్ధార్థ కళాశాల నుంచి కంకిపాడు దాటిన తర్వాత దావులూరు టోల్‌ప్లాజా సమీపంలో అమరావతి ఓఆర్ఆర్ మలుపుతిరిగే చోటువరకు 14 కిలోమీటర్ల మేర ప్రస్తుతమున్న నాలుగు వరుసల హైవేకి ఇరువైపులా సర్వీస్ రోడ్లను నిర్మించనున్నారు. ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్?ఆర్) క్రాస్ అయ్యే ప్రాంతం నుంచి మచిలీపట్నం వరకు 45.695 కిలోమీటర్ల మేర ఆరు వరుసలగా విస్తరిస్తారు. దీనిని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) కింద నిర్మిస్తున్నారు.

### భూసేకరణకు నోటిఫికేషన్

హైదరాబాద్-నందిగామ మధ్య విస్తరణకు అవసరమైన భూసేకరణకు ఎన్‌హెచ్ఏఐ నోటిఫికేషన్?ను జారీచేసింది. చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల పరిధిలో కేవలం 6.32 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉంది.


# దసరా నాటికి పదవులు పంపకం



**నల్గొండ :** రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో, అధికార కాంగ్రెస్ పార్టీ అందుకు తగ్గట్టు ప్రణాళికలు రచిస్తోంది. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు త్వరలోనే పదవుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడానికి పార్టీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా ఈ నియామకాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ సాగుతోంది. ఇందులో భాగంగానే వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాలు, ఖంఅూ, మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల నియామక ప్రక్రియను వేగవంతం చేశారుఇటీవల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పార్టీ అధిష్టానంతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ భేటీలో ఆశావహుల జాబితాను హైకమాండ్‌కు సమర్పించినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నియామకాలపై తుది నిర్ణయం వెలువడనుంది. విజయదశమి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, కార్యకర్తలకు దసరా కానుకగా అందించాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.గత ఎన్నికల నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులు, గ్రాస్‌రూట్ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అదే సమయంలో పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులకు సుమారు 20 శాతం మేర ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంది. అలాగే సామాజిక సమతుల్యతను కాపాడడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలకు సముచిత స్థానం కల్పించనున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా ఖాళీగా ఉన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ వంటి ఇతర కీలక పదవులను కూడా భర్తీ చేసే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి.. దసరా పండుగ వేళ కాంగ్రెస్ పార్టీ ప్రకటించబోయే ఈ నామినేటెడ్ పదవుల జాబితా పార్టీలో నెలకొన్న అసంతృప్తులను తొలగించి, శ్రేణుల్లో జోష్ నింపుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. రాబోయే రాజకీయ పోరుకు ఈ నియామకాలు ఒక బలమైన పునాదిగా మారుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# ఫాం హౌస్‌లో 10 ఎకరాల అసైన్డ్ భూమి?

**మెదక్ :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ అంశం మరోసారి కేంద్ర బిందువుగా మారింది. ఈ భూములపై ప్రభుత్వం శరవేగంగా విచారణ చేపడుతోంది. సిద్ధిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న ప్రభుత్వ గైరాన్ భూములు, అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది.ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఎర్రవల్లి, సమీప శివారు వెంకాపురం గ్రామాల్లో గత మూడు రోజులుగా భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే ద్వారా ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు వెల్లడైంది. అంతేకాకుండా, దళితులకు కేటాయించాల్సిన ఈ భూములను కొందరు అన్యక్రాంతం చేసుకుని, ఫాంహౌస్ అవసరాల కోసం నీటి వనరుల నిర్మాణానికి ఉపయోగించినట్లు తేలింది.భూ ఆక్రమణలపై సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388.05 ఎకరాల గైరాన్ భూమి ఆక్రమణలను గుర్తించి, సంబంధిత భూయజమానులకు గత వారంలోనే 180 నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించాల్సిన భూయజమానులు ఇవాల్టి నుంచి తమ పత్రాలతో అధికారుల ముందు హాజరవుతున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర చట్టబద్ధమైన పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ రాకతో రికార్డులు తారుమారయ్యాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.



ఎర్రవల్లి, శివారు వెంకాపురం గ్రామాల మధ్య సర్వే నంబర్లు, భూ రికార్డుల్లో తీవ్రమైన లొసుగులు, ఓవర్‌లాపింగ్ ఉన్నాయని మర్కూక్ తహశీల్దార్ సరితకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పాండురంగ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతన్నలకు ప్రత్యామ్నాయ భూములు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదని వాపోతున్నారు.ఈ వివాదంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వివాదాస్పద సర్వే నంబర్ 325లో నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను అనుభవిస్తున్న అనర్హులను తొలగించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. నిజమైన దళిత రైతులకు దక్కాల్సిన భూములను వెనక్కి తీసుకుని, నిరుపేద దళిత కుటుంబాలకు పంపిణీ చేయాలని సర్కార్ భావిస్తోంది. మరోవైపు ఏ ఒక్క దళితుడి లేదా గిరిజనుడి భూమిని ప్రభుత్వం తీసుకోదని, సెక్షన్ 22ఏ పై మళ్లీ సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యేగా దానం అనర్హుడే

-మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించింది. అటు సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఒక పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్ పేర్కొన్నారు. దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఈ విధంగా వేరే పార్టీ నుంచి పోటీ చేశారన్న కారణంతో బిహార్ రాష్ట్రానికి చెందిన మహాచంద్రప్రసాద్ అనే వ్యక్తిని సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని శాసన సభాపతి ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. ఈ పిటిషన్?పై విచారించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పును సమర్థించింది.

### సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందన

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును వెలువరించిన సందర్భంగా ఆయన స్పందించారు. తనకు ప్రజా క్షేత్రంలో బలం ఉందని తెలిపారు. తాను ప్రతి ఇంటికి సేవ చేశానని వాళ్లను అడిగితే తెలుస్తుందన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు. "సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. గతంలో మూడు సార్లు గెలిచాను. ఒక ఉపఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. నాకు ప్రజా క్షేత్రంలో బలం ఉంది కలిసి పని చేస్తాం తప్పకుండా గెలుస్తాం. పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు"

### ఇదీ కేసు నేపథ్యం

పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన సభాపతి ఈ పిటిషన్‌లను కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్?పై అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పును వెలువరించింది.

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. దానంపై అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

### అలా చేయడం స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని వదులుకున్నట్లే

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిచ్చారని హైకోర్టు తెలిపింది. శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదని, ఒకవేళ మరో పార్టీ టిక్కెట్?పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించాల్సి వస్తే రాజ్యాంగం దాన్ని స్పష్టంగా పేర్కొని ఉండేదని, అలా నిర్దేశించనపుడు రాజ్యాంగ అనర్హతను నిర్ధారించలేమని స్పీకర్ పేర్కొన్నట్లు హైకోర్టు వివరించింది.

## 22ఏ భూములపై రిజిస్ట్రేషన్లకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు. ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉంటారు. 22ఏ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది. ఈ కమిటీ పరిధి కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు"

-మొదటిపేజీ తరువాయి


దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ ఏరాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ఆయన ప్రశ్నించారు.

## బిజినెస్

### ఫార్మా రంగంలో రెండంకెల వృద్ధి




**న్యూఢిల్లీ :** దేశీయ ఫార్మా రంగం భారీ వృద్ధిని నమోదు చేసుకుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫార్మా సంస్థల ఆదాయంలో వృద్ధి 11 శాతం నుంచి 13 శాతం మధ్యలో ఉండనున్నట్టు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. కిందటేడాది సింగిల్ డిజిట్ 8 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న ఫార్మా రంగం..ఈసారి రెండంకెల వృద్ధికి చేరుకోనున్నదని తెలిపింది. ప్రధానంగా ఎగుమతులు పుంజుకోవడంతోపాటు దేశీయంగా డిమాండ్ అధికంగా ఉండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. అయితే, ముడి సరుకులు, ఇంధన, రవాణా ఖర్చులు పెరుగడం వల్ల నిర్వహణ లాభాల మార్జిన్లు 150-200 బేసిస్ పాయింట్లు తగ్గి 21-21.5 శాతానికి పరిమితం కావచ్చునని అంచనావేస్తున్నది. దీంతో అధిక ఆదాయ వృద్ధి పూర్తిగా నికర లాభాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు కూడా మెండుగావున్నాయని పేర్కొంది. కంపెనీల లాభాల మార్జిన్లపై ఒత్తిడి ఉన్నప్పటికీ, బలమైన నగదు ఉత్పత్తి, ద్రవ్య లభ్యత, పటిష్టమైన బ్యాలెన్స్ షీట్ల కారణంగా ఈ రంగం రుణ పరపతి స్థాయిలు దృఢంగానే ఉంటాయని అంచనావేస్తున్నది. అత్యధికంగా అమెరికాకు ఎగుమతి అవుతున్న దేశీయ ఔషధ ఎగుమతుల్లో 83 శాతం ఫార్ములేషన్ వాటా ఉన్నది.

### పీఎంఎస్ రూల్స్ సరళతరం

**ఐపీవోల్లో పోర్ట్‌ఫోలియో మేనేజర్ల పెట్టుబడులకు సెబీ అనుమతి**




**ముంబై :** మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) విధానం సమగ్ర పునర్వ్యవస్థీకరణకు సై అన్నది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (పోర్ట్‌ఫోలియో మేనేజర్లు) రెగ్యులేషన్స్ 2026కు గురువారం సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. ప్రస్తుతమున్న 2020 రెగ్యులేషన్స్ స్థానంలో అమల్లోకి వస్తున్న ఈ మార్పులతో పీఎంఎస్ క్లైయింట్లకు పెట్టుబడి అవకాశాలు పెరుగనున్నాయి. అంతేగాక అనవసరమైన నిబంధనలు తొలగిపోనున్నాయి. ఈ క్రమంలోనే ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో)లో, ప్రైమరీ మార్కెట్ డెట్ ఇష్యూల్లో పెట్టుబడులకు పోర్ట్‌ఫోలియో మేనేజర్లకు మార్గం సుగమమైంది. విస్తృత శ్రేణి విదేశీ సెక్యూరిటీలకూ లైన్ క్లియరైంది. ఇదిలావుంటే ఫిజికల్లీ సెటిల్డ్ నాన్-అగ్రికల్చరల్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్ట్స్‌లో పాల్గొనడానికి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)ను అనుమతించాలని సెబీ నిర్ణయించింది.

# పండుగ ఖర్చులు అప్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: పండుగ ఖర్చులు అమాంతం పెరిగిపోతున్నాయి. ప్రస్తుత సంవత్సరంలో పండుగ సీజన్‌లో భారతీయులు తమ ఖర్చులు పెంచుకోవడానికి ఆసక్తి చూపేవారి సంఖ్య చాలా తక్కువ మంది ఉన్నట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇన్‌మొబి అడ్వైర్టైజింగ్ తాజాగా విడుదల చేసన తన సర్వేలో ఈ పండుగ సీజన్‌లో రూ.50 వేలు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు పెట్టాలనుకునే వారు భారీగా పెరిగారు. ఇదే సమయంలో రూ.10 వేల స్థాయిలో ఖర్చు పెట్టేవారిలో పెద్ద వృద్ధి నమోదుకాలేదు. మొత్తంమీద ఈ పండుగ సీజన్‌లో తమ ఖర్చులు పెంచుకునేవారు మాత్రం తగ్గుముఖం పట్టడం విశేషం. దేశవ్యాప్తంగా ఆగస్టు 7 నుంచి 11 వరకు 1,110 మంది పురుషులు, స్త్రీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా సర్వే సంస్థ ఈ నివేదికను రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 22 శాతం మంది రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు, రూ.50 వేలకు పైగా ఖర్చు చేద్దామనుకునే వారు 15 శాతం చొప్పున అధికమయ్యారు. సుమారు 60 శాతం మంది వినియోగదారులు పండుగలకు ఒక నెల ముందుగానే కొనుగోళ్లు చేయడానికి ప్రణాళికలు వేసుకుంటుండగా..29 శాతం మంది మాత్రం కేవలం వారం రోజుల ముందు షాపింగ్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. 77 శాతం మందిదేశీయ వినియోగదారులు తమ పండుగ షాపింగ్



బడ్జెట్‌ను పెంచుకుంటున్నారు. ఐదుగురిలో ముగ్గురు పెట్టే ఖర్చు రూ.10 వేల కంటే అధికంగా ఖర్చుచేయాలని చూస్తున్నారు.

# పెరుగుతున్న ముడిచమురు ధరల ఎఫెక్ట్..
# భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్‌లు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ్టి (గురువారం) ట్రేడింగ్‌లో భారీ నష్టాలను చవిచూశాయి. పెరుగుతున్న ముడిచమురు ధరలు (జతీబనవ ూాఅశ్రీ ూాతీఱఎవ), ప్రపంచ మార్కెట్లలో అమ్మకాల ప్రభావంతో ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకునేందుకు వెనుకంజవేశారు. దాంతో బ్యాంకింగ్, ఆర్థికరంగ షేర్లలో భారీగా అమ్మకాలు జరిగాయి. సెన్సెక్స్ (ూవఅంవఞ) 1,247.71 పాయింట్లు నష్టపోయి 73,580.54 వద్ద ముగిసింది. నిఫ్టీ (చీఱట్ఎ) 383.70 పాయింట్లు కోల్పోయి 23,063.10 వద్ద స్థిరపడింది. అయితే ఈ మార్కెట్ పతనం ప్రధాన షేర్లకు మాత్రమే పరిమితం కాలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.25 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.53 శాతం నష్టపోయాయి. నిఫ్టీలో మూడు షేర్లు మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయి ఒత్తిడి పెంచాయి. బ్యాంకింగ్, ఆర్థికరంగ షేర్లపై అమ్మకాల ప్రభావం ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా భారీగా నష్టపోయాయి. పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి ఈ రంగంపై ఇన్వెస్టర్ల ఆందోళనను పెంచాయి.



మీడియా, ఫార్మా సూచీలు కూడా నష్టాల్లో ముగిసినా మిగతా రంగాలతో పోలిస్తే నష్టం తక్కువగా ఉంది. నిఫ్టీ 23,000 స్థాయిని నిలబెట్టుకోలేకపోతే 22,900-22,800 వరకు పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,200 స్థాయి తక్షణ నిరోధంగా ఉంటుందని పేర్కొన్నారు. ముడిచమురు ధరలు, ప్రపంచ బాండ్ మార్కెట్ పరిణామాలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నారని నిపుణులు అన్నారు.

# హసరంగ మళ్లీ దూరం..
# వన్డే సిరీస్‌లో శ్రీలంక నిలబడేనా..!

ఇంగ్లండ్ పర్యటనలో తేలిపోతున్న శ్రీలంకు మరో షాక్. అసలే.. టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు లోనైన బాధ నుంచి తేరుకోకముందే.. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ వనిందు హసరంగ వన్డేలకు దూరమయ్యాడు. మూడు వన్డేల సిరీస్‌కు ముందే కారణంగా ఈ సీనియర్ ఆల్‌రౌండర్ స్వదేశానికి రానున్నాడు. ఈ విషయాన్ని గురువారం లంక క్రికెట్ వెల్లడించింది.
శ్రీలంక స్పిన్ అస్త్రంగా పేరొందిన వనిందు హసరంగ మరో ద్వైపాక్షిక సిరీస్‌కు దూరమయ్యాడు. ఇటీవల కాలంలో తరచూ గాయాలతో జట్టుకు దూరమవుతున్న ఈ మిస్టరీ బౌలర్ .. ఈసారి కూడా రిహాబిలిటేషన్‌లో ఉండనున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో తొలి వన్డేకు ముందు నెట్స్‌లో హసరంగ ఇబ్బందిపడడమే అందుకు కారణం. బౌలింగ్ చేస్తుండగా.. వెన్ను కింది భాగంలో నొప్పి మొదలైంది. దాంతో అతడు తొలి వన్డే ఆడలేదు. అనంతరం పరీక్షలు నిర్వహించగా.. వైద్యులు విశ్రాంతి సూచించారు. దాంతో.. వన్డే సిరీస్ మొత్తం హసరంగ అందుబాటులో ఉండడని లంక క్రికెట్ తెలిపింది.
మూడేళ్ల క్రితం వన్డే వరల్డ్‌కప్‌లో గాయపడిన హసరంగ.. అప్పటి నుంచి ఆడింది కొన్ని మ్యాచ్‌లే. ప్రపంచకప్ లీగ్ దశ ఐర్లాండ్‌పై మూడు వికెట్లతో మెరిసిన హసరంగ.. గాయంతో టోర్నీ నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో




లీడ్స్‌లో జరుగుతున్న తొలి వన్డేలో కెప్టెన్ కుశాల్ మెండిస్(121) శతకంతో.. లంక 6 వికెట్ల నష్టానికి 321 పరుగులు చేసింది.

# వెస్టిండీస్ కెప్టెన్ ప్రపంచ రికార్డు

విధ్వంసకర సెంచరీతో చెలరేగింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన మాథ్యూస్.. జింబాబ్వే బౌలర్లను ఉతికారేసింది. కేవలం 15 బంతుల్లో 26 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 182 పరుగులు చేసి తృటిలో డబుల్ సెంచరీని చేజార్చుకుంది. ఫలితంగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. అనంతరం ఈ భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 43.3 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. దీంతో 99 పరుగుల తేడాతో విండీస్ ఘన విజయం సాధించింది. జింబాబ్వే బ్యాటర్లలో మోడెస్టర్ ముపాచిక్వా టాప్ స్కోరర్‌గా నిలవగా.. విండీస్ బౌలర్లలో ఆలియా అల్లెన్ మూడు, అశ్మిని మునిసార్, ఫ్లెచర్ తలా రెండు వికెట్లు పడగొట్టింది. ఇక ఈ మ్యాచ్‌లో భారీ సెంచరీతో చెలరేగిన మాథ్యూస్ పలు రికార్డులను తన పేరిట లిఖించుకుంది. వెస్టిండీస్ మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు బ్యాటర్‌గా ఆమె చరిత్రకెక్కింది. ఇంతకుముందు ఈ దిగ్గజ ఆల్‌రౌండర్ స్టెఫానీ టేలర్ (171) పేరిట ఉండేది. తాజా ఇన్నింగ్స్‌తో ఆ రికార్డును హేలీ మాథ్యూస్ అధిగమించింది. అదేవిధంగా వన్డేల్లో ఒకే క్యాలెండర్ ఈయర్‌లో రెండుసార్లు




150కి పైగా పరుగులు సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా హేలీ మాథ్యూస్ నిలిచారు. ఇదే ఏడాది మేలో ఐర్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో కూడా మాథ్యూస్ 159 పరుగులు పరుగులు చేసింది. ఇక ఓవరాల్‌గా మహిళా వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు నమోదు చేసిన జాబితాలో మాథ్యూస్ ఐదో స్థానంలో నిలిచింది. ఈ లిస్ట్‌లో అమేలియా కేర్ (న్యూజిలాండ్)-232 అగ్రస్థానంలో ఉంది.

## స్పోర్ట్స్

### ఆసీస్ లక్ష్యం 363




**పుదుచ్చేరి :** భారత్, ఆస్ట్రేలియా-ఏ జట్ల మధ్య జరుగుతున్న అనధికారిక తొలి టెస్టులో భారత-ఏ జట్టు ప్రత్యర్థి ఎదుట 363 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది. తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకున్న భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 199కే ఆలౌట్ అయింది. కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (59), కుశాగ్ర (46 నాటౌట్) ఆదుకున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌కు వచ్చిన ఆస్ట్రేలియా-ఏ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది.

### తొలి వన్డేలో సఫారీల గెలుపు



**డర్బన్ :** దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా ఓటమితో ఆరంభించింది. డర్బన్ వేదికగా ఇరుజట్ల మధ్య జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య సఫారీ జట్టు.. 67 పరుగుల తేడాతో కంగారూలను ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 297/8 స్కోరు చేసింది. మాథ్యూ బ్రీట్జె (112) శతకంతో రెచ్చిపోగా ఆఖర్లో మార్కో యాన్సెన్ (75) మెరుపులు మెరిపించాడు. ఛేదనలో ఆసీస్ 41.2 ఓవర్లకు 230 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (60), మాథ్యూ రెన్‌షా (44) పోరాడారు.






# ‘రాకా’.. కోసం 37 మంది.. 92 కెమెరాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘రాకా’. సినిమా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాకముందే ఈ మూవీ ప్రపంచ రికార్డు సాధించి వార్తల్లో నిలిచింది. ఏకంగా 37 మంది ఒకేసారి మోషన్ క్యాప్చర్ చేయించుకోవడం ద్వారా ‘రియల్ టైమ్ మోషన్–క్యాప్చర్’(వీశీర్ా్రవశీజూ్రీవ వీశీఅశీఅ–ఝుజ్బతీవస అఅ =ఝ్రీ–ఎఅఎవ) విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. ఈ రికార్డును అధికారికంగా ధృవీకరించారు. అయితే అసలు ఏంటి ఈ రికార్డ్ అని చాలా మంది సోషల్ మీడియాకు పని చెప్తున్నారు. అదేంటో తెలుసుకుందాం..రండి..!

**ఒకేసారి 37 మంది..**

సాధారణంగా మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని ఒకరు లేదా కొంతమంది నటుల యాక్టింగ్‌ను రికార్డు చేసేందుకు ఉపయోగిస్తుంటారు. కానీ ‘రాకా’ కోసం ఏకంగా 37 మంది యాక్టర్స్ యాక్టింగ్‌ని ఒకే సమయంలో క్యాప్చర్ చేశారు. ఇందులో నాలుగేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల వ్యక్తి వరకు వివిధ వయసుల వారు కూడా ఉండడం గమనార్హం. అందరి కదలికలను ఒకరికొకరు ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా ట్రాక్ చేయడం ఈ ప్రక్రియలో ప్రధాన సవాలుగా నిలిచింది.

**92 కెమెరాలతో భారీ సెటప్**

ఈ రికార్డు కోసం మేకర్స్ ఏకంగా 92 ఆప్టికల్ మోషన్ క్యాప్చర్ కెమెరాలను ఉపయోగించారట. క్యాప్చర్, కాలిబ్రేషన్, నెట్‌వర్కింగ్, సింక్రనైజేషన్‌తో పాటు రియల్ టైమ్ విజువలైజేషన్, ఫేషియల్ క్యాప్చర్ వంటి టెక్నాలజీలను కూడా ఈ సెటప్‌లో భాగం చేశారని తెలిసింది.

**మోషన్ క్యాప్చర్ అంటే?**

నిజ జీవితంలో ఒక నటుడు చేసే యాక్టింగ్‌ని టెక్నాలజీ ద్వారా రికార్డు చేసి, వాటిని డిజిటల్ లేదా జ+× క్యారెక్టర్‌కు అందించడమే మోషన్ క్యాప్చర్. ‘రాకా’లో మాత్రం ఒకరిద్దరి కదలికలు కాకుండా 37 మంది యాక్టింగ్‌ని ఒకేసారి రికార్డు చేశారు. ఈ స్థాయిలో మోషన్ క్యాప్చర్ చేయడానికి ప్రత్యేకమైన పైప్‌లైన్, వర్క్‌ఫ్లోను చిత్రబృందం సిద్ధం చేసింది. ఇందుకోసం అవసరమైన ప్రత్యేక పరికరాలను లాస్ ఏంజెల్స్ నుంచి తీసుకొచ్చి సొంత మోషన్ క్యాప్చర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు దర్శకుడు అట్లీ వెల్లడించారు.

**బన్నీ, అట్లీ చేతికి గిన్నిస్ సర్టిఫికెట్**

ఈ రికార్డుకు సంబంధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అల్లు అర్జున్, అట్లీ అందుకున్నారు. సినిమా విడుదలకు ముందే ఇలాంటి అరుదైన ఘనత సాధించడం ‘రాకా’పై అంచనాలను మరింత పెంచింది. ఇక ఈ సినిమాలో అల్లు అర్జున్‌తో పాటు దీపికా పదుకొణె కీలక పాత్రలో కనిపించనుంది. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో తెరకెక్కుతున్న ఈ సినిమా 2027లో ప్రేక్షకుల ముందుకు రానుందని టాక్.

# ‘ఆ రోజు నాకు రెండో జీవితం దక్కింది’.. ఐదేళ్ల క్రితం ప్రమాదాన్ని గుర్తుచేసుకున్న సాయి దుర్గా తేజ్



మెగా హీరో సాయి దుర్గా తేజ్ జీవితంలో 2021 సెప్టెంబర్ నెలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండి చికిత్స తీసుకున్నారు. ప్రమాదం నుంచి క్రమంగా కోలుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. ఇప్పుడు ఆ ప్రమాదం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సాయి దుర్గా తేజ్ చేసిన భావోద్వేగ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐదేళ్ల క్రితం ఇదే రోజున తనకు జీవితంలో రెండో అవకాశం లభించిందని సాయి దుర్గా తేజ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అందించిన అండ తన కోలుకునే ప్రయాణంలో ఎంతో కీలకంగా నిలిచిందని చెప్పారు. వారి ప్రేమ, ప్రార్థనలు, సందేశాలు తనకు కష్టమైన రోజుల్లో ముందుకు సాగేందుకు బలాన్ని ఇచ్చాయని గుర్తుచేసుకున్నారు. ప్రమాదంలో ఎదురైన గాయాల నుంచి తాను దాదాపు 90 శాతం వరకు కోలుకున్నానని సాయి దుర్గా తేజ్ తెలిపారు. అయితే మాటతీరు సహా కొన్ని విషయాల్లో ఇంకా పూర్తిగా మెరుగుపడేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రతిరోజూ ఒక్కో అడుగు ముందుకు వేస్తూ కోలుకుంటున్నానని పేర్కొన్నారు. కష్టమైన ప్రతి రోజు, ఎదురుదెబ్బ తగిలిన ప్రతి సందర్భం, వదిలేయడం సులభంగా అనిపించిన ప్రతి క్షణంలోనూ మీ ప్రేమే నాకు బలాన్ని ఇచ్చింది. ఐదేళ్ల తర్వాత కూడా నేను నిలబడి ఉన్నాను. పోరాడుతున్నాను. జీవిస్తున్నాను అనే భావాన్ని ఆయన తన పోస్ట్‌లో వ్యక్తం చేశారు. తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ, పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పినవారికి, ప్రతి సందేశం ద్వారా ప్రేమను పంచుకున్నవారికి సాయి దుర్గా తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి అభిమానుల ప్రేమ కూడా ఒక ముఖ్యమైన కారణమని చెప్పారు. తన ప్రమాదం నుంచి అందరూ ఒక విషయాన్ని నేర్చుకోవాలని సాయి దుర్గా తేజ్ సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ ధరించడం చిన్న నిర్ణయంలా కనిపించినా.. ప్రాణాలను కాపాడటంలో అది ఎంతో కీలకమని తన అనుభవం ద్వారా చెప్పారు.ప్రమాదం తర్వాత సాయి దుర్గా తేజ్ మళ్లీ సినిమాల్లోకి రావడం కూడా అభిమానుల్లో ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు ఆయన వరుసగా సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఇక సాయి దుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం ‘సంబరాల ఏటిగట్టు’. రోహిత్ కేపీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జగపతి బాబు, ఐశ్వర్య లక్ష్మి, శ్రీకాంత్, సాయి కుమార్, అనన్య నాగళ్ల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ నటుడు కూడా ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెట్రివేల్ పళనిస్వామి ఛాయాగ్రహణం అందిస్తుండగా.. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. భారీ యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# 64 ఏళ్ల వయసులోనూ అదిరిపోయే స్టంట్స్..

## అర్జున్ సర్జా ఫిట్‌నెస్ సీక్రెట్ ఇదేనా?



దక్షిణాది సినీ పరిశ్రమలో ‘యాక్షన్ కింగ్’గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ సర్జా ఇప్పటికీ తన ఫిట్‌నెస్‌తో అభిమానులను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు. 64 ఏళ్ల వయసులోనూ యువకుడిలా కఠినమైన యాక్షన్ విన్యాసాలు చేయగల ఆయన సామర్థ్యానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.తాజాగా వైరల్ అవుతున్న వీడియోలో అర్జున్ సర్జా ఎంతో సులభంగా గాల్లోకి కాలు ఎత్తి, కరాటే విన్యాసంతో బాటిల్ మూతను ఎగరగొట్టారు. ఈ స్టంట్‌లో ఆయన చూపించిన వేగం, శరీర సౌష్టవం, కాళ్ల ఫ్లెక్సిబిలిటీ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. వయసు 64కు చేరినా ఆయనలోని చురుకుదనం ఏమాత్రం తగ్గలేదంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అర్జున్ సర్జా ఫిట్‌నెస్‌కు ప్రధాన కారణాల్లో మార్షల్ ఆర్ట్స్ సాధన ఒకటిగా చెప్పొచ్చు. చిన్నతనం నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకున్న ఆయన.. ఇప్పటికీ కరాటే, కిక్ బాక్సింగ్ వంటి శిక్షణను కొనసాగిస్తున్నట్లు గతంలో పలుమార్లు వెల్లడించారు. శరీరాన్ని చురుకుగా ఉంచేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు యోగా, స్ట్రెచింగ్ వంటి సాధనలకు కూడా ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, సమతుల్యమైన ఆహారపు అలవాట్లు కూడా తన ఫిట్‌నెస్‌లో కీలక పాత్ర పోషిస్తున్నాయని అర్జున్ సర్జా గతంలో చెప్పిన సందర్భాలున్నాయి. వయసు పెరిగే కొద్దీ శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ అవసరమనే విషయాన్ని ఆయన జీవనశైలి చూపిస్తోంది. అర్జున్ సర్జా సినీ ప్రస్థానం విషయానికి వస్తే.. తెలుగులో ఆయన నటించిన తొలి చిత్రంగా ‘మా పల్లెలో గోపాలుడు’ (1985) నిలిచింది. ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రాల్లో వరుస అవకాశాలు అందుకుంటూ దక్షిణాదిలో యాక్షన్ హీరోగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ‘జెంటిల్‌మెన్’, ‘ఒకే ఒక్కడు’, ‘హనుమాన్ జంక్షన్’, ‘ప్రసాద్’, ‘పుట్టింటికి రా చెల్లి’ వంటి సినిమాలు ఆయనకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును తీసుకొచ్చాయి. తమిళంలో తెరకెక్కిన పలు చిత్రాలు తెలుగులోకి అనువాదం కావడంతో ఆయనకు ఇక్కడ కూడా భారీ అభిమానగణం ఏర్పడింది. ఇప్పటివరకు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో కలిపి 160కి పైగా చిత్రాల్లో నటించిన అర్జున్.. నటుడిగానే కాకుండా దర్శకుడిగానూ తన ప్రతిభను చాటుకున్నారు. ‘సేవగన్’తో దర్శకుడిగా మారిన ఆయన ఆ తర్వాత ‘జై హింద్’, ‘కర్ణ’, ‘ఎజుమలై’, ‘పరశురామ్’, ‘జై హింద్ 2’ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు.

# ‘సిగ్మా’ ప్రీ-రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి!



టాలీవుడ్ టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్, గ్లామరస్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హై–వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ‘సిగ్మా’ తమిళనాడు సీఎం, నటుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. కాగా, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ–రిలీజ్ వేడుక రేపు హైదరాబాద్‌లోని ప్రఖ్యాత పార్క్ హయత్ వేదికగా వైభవంగా జరగనుంది. ఈ ఈవెంట్‌కు టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. స్టార్ డైరెక్టర్‌గా మారుతున్న జేసన్ సంజయ్ మొదటి సినిమా వేడుకకు మెగాస్టార్ గెస్ట్‌గా వస్తుండటంతో ఈ ఈవెంట్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రూ. 500 కోట్ల నేపథ్యంతో సాగే క్రైమ్, గ్యాంబ్లింగ్ మరియు మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ (వీవ్ష్ట్రతీఱ =వశ్రీఝుంవ) విడుదల చేస్తోంది. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512